

రెండవ రోజు కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి

వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
గురువారం 27 మార్చి 2025

### కొత్త రథం నిర్మాణానికి

# అనుమతి

పులివెందుల రూరల్, మార్చి 26, ప్రభాతవార్త :

పులివెందుల లో ఎంతో ప్రసిద్ధి పొందిన శ్రీ రంగనాథ స్వామి ఆలయానికి సంబంధించి కొత్త రథం నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రూ.60 లక్షల వ్యయంతో రథాన్ని నిర్మించడానికి గతంలో టెండర్లు జరిగాయి . ప్రభుత్వం మారడం తో ఈ పనులు ఆగిపోయాయి. ఇటీవల భక్తులు ఈ విషయాన్ని శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి దృష్టికి తెచ్చారు . ఆయన దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి, ఆలయ ప్రాశస్త్యం, ప్రస్తుతం ఉన్న రథం దెబ్బతిన్న విషయాలను వివరించారు. టెండర్లను ఆమోదించి,పనులు ప్రారంభింపచేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు దేవదాయ కమిషనర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పేరుకే ఉపాధి హామీ..!

- ఉపాధి కార్మికుల సమస్యలెన్నో...
- సక్రమంగా అందని కూలీ డబ్బులు
- సకాలంలో అందని మాస్టర్ కూలీ
- సమ్మర్ అలవెన్స్..క్యూబిక్ మీటర్ రేటు పెంచాలన్న డిమాండ్

(అన్నమయ్య ప్రతినిధి - ప్రభాతవార్త)

అన్నమయ్య జిల్లాలో ఉపాధి హామీ పథకం అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉపాధి హామీ కార్మికుల సమస్యలు కూడా పరిష్కరించే నాథుదే కానరావడం లేదన్న విమర్శలున్నాయి. కూలీ డబ్బుల మొదలు, మాస్టర్ కూలీ వరకు లోటుపాట్ల నడుమ ఈ పథకం అమలవుతున్నట్టు సమాచారం. గ్రామీణ కుటుంబాలలోని వయోజన సభ్యులు ఉపాధిని కోరుతూ, నైపుణ్యం లేని చేతి పని చేయడానికి సిద్దంగా ఉన్నవారికి ఆర్థిక సంవత్సరంలో 100 రోజుల వేతన ఉపాధికి చట్టపరమైన హామీని అందించడమే లక్ష్యంగా మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం 2005ను భారత ప్రభుత్వం 2005 సెప్టెంబర్‌లె ఆమోదించింది. భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఈ పథకం అమలును రాష్ట్ర ప్రభుత్వాల సమకారంలో పర్యవేక్షిస్తుంది. స్థానికంగా గ్రామ పంచాయితీలు బాధ్యత వహిస్తాయి. రోడ్ల నిర్మాణం, నీటి సంరక్షణ, అడవుల పెంపకం వంటి శ్రమతో కూడిన పనులు ఈ పథకం క్రింద చేపడతారు. నీటి సంరక్షణలో నీటి నిలవలు, సౌకర్యాలు పెంచడం, నీటి కాలవలు, సంప్రదాయక నీటి సంస్థల పునరుద్ధరణ, వరదల నియంత్రణ, రక్షణ పనులు, అడవుల సంరక్షణ క్రింద అడవుల పెంపకం, చెట్లు నాటడం,రహదారులు, భవనాల నిర్మాణం క్రింద గ్రామాల్లో అన్ని వాతావరణాల్లో వాడుకునేలా రహదారుల నిర్మాణం, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాల భవనాల నిర్మాణం పనులు చేపడతారు. కరవు నివారణ కోసం, వలసల నివారణ కోసం ఉపాధి హామీ చట్టాన్ని సదుద్దేశ్యంతో తీసుకొచ్చారు. రెండు దశాబ్దాల తరువాత ఉపాధి హామీ చట్టం అమలులో అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటుంది. దీంతో ఉపాధి హామీ కార్మికులు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడే పరిస్థితులు నెలకొన్నాయన్న విమర్శలు గుప్పుమంటున్నాయి. దేశంలో ధనిక, పేద వ్యత్యాసాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించేందుకు రూపొందించిన ఉపాధి హామీ పథకంలో సుమారు 3వ వంతు పనులను స్త్రీలకు ప్రత్యేకంగా కేటాయించారు. పని చూపించలేకపోతే నిరుద్యోగ భృతి ఇచ్చేలా ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు బ్యాంకల్లో ఖాతాలు తెరిచి సమీప కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వేతనం బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. ఉపాధి హామీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ కూలీ డబ్బులు ఉపాది కూలీలకు సత్వరం చెల్లించాలని సిఐటియు, రైతు కార్మిక సంఘాలు ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నాయి. బడ్జెట్‌లో కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధుల్లో కోత విధిస్తుండడంపై వీరు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. వారం వారం ఉపాధి కార్మికులు చేసిన పనికి మాస్టర్ కూలీ పడాల్సి ఉండగా, 3 నెలల నుండి జిల్లాలోని అనేక గ్రామాల్లో కూలీ డబ్బులు కూడా రాలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తినేందుకు తిండి లేని కటిక పేదలే అధికంగా ఉపాధి హామీ పనులు చేస్తున్నారు. రెక్కాడితే కాని డొక్కాడని స్థితిలో ఉండే ఇలాంటి వారికి సకాలంలో కూలీ డబ్బులు రాకుంటే వారి కుటుంబాల జీవన పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఒకేమారు కూలీ డబ్బులు వేసినా తగిన ఫలితం ఉండదు. సకాలంలో కూలీ డబ్బులు పడినప్పుడే వారి నోటికి అన్నం ముద్ద సక్రమంగా చేరుతుంది. చాలా చోట్ల కూలీ డబ్బులు సక్రమంగా ఖాతాల్లో పడకపోవడంతో ఉపాధి హామీ పనులు చేసేందుకు ఉత్సాహం కూలీల్లో కరవవుతుంది. ఇక వచ్చే కూలీ డబ్బులు కూడా రూ.200 నుండి రూ.250 కంటే ఎక్కువ రావడం లేదని, నిత్యావసర వస్తువుల ధరలు చూస్తే ఆకాశాన్ని తాకుతున్నాయని, కనుక ఉపాధి హామీ కూలీని కూడా నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కనీస కూలీని కనీసం రూ.500 నుండి రూ. 600కు పెంచాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తుంది. అలాగే క్యూబిక్ మీటర్ పనికి కూడా రేటు పెంచాలని, ఫారం ఫండ్స్ పనులు చేసేటప్పుడు భూమి గట్టితనం వల్ల తెగక ఎక్కువ సమయం తీసుకుంటుండడం వల్ల కార్మికులు నష్టపోతున్నారు. కనుక క్యూబిక్ మీటర్ పనికి రేటు పెంచడం న్యాయ సమ్మతమైన డిమాండ్ అని కార్మికులు పేర్కొంటున్నారు. అలాగే సమ్మర అలవెన్స్ 30 శాతం గతంలో ఇచ్చేవారని, ప్రస్తుతం ఇవ్వడం లేదని తెలుస్తోంది. వేసవిలో శీతాకాలంలో పనులు చేసేటప్పుడు చాలా తేదా ఉంటుందని, వేసవిలో ఎండలను దృష్టిలో ఉంచుకొని అలవెన్స్ ఇవ్వడం కూడా న్యాయ సమ్మతమైన డిమాండ్‌గా కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేస్తుండడం జరుగుతోంది. కనీసం ఎండలను దృష్టిలో ఉంచుకొని ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు ఎండాకాలంలో మంచినీళ్లు ఏర్పాటు చేయడం, మజ్జిగ, వారాసేస్సు ఇవ్వాలన్న డిమాండ్ కూడా ఉపాధి హామీ కూలీల నుండి వినిపిస్తుంది. కనీసం గడ్డపార, పారలు, గోళాలు కూడా పనులు చేస్తున్న కూలీలకు అందివ్వనందున కూలీలే తమ డబ్బులతో కొనుగోలు చేసుకొని ఏర్పాటు చేసుకొని ఉపాధి హామీ పనులు చేసుకునే దౌర్భాగ్య పరిస్థితి ఉంది. కనీసం మానవత్వ విలువలను దృష్టిలో ఉంచుకొని పనుల్లో డెబ్బలు తగిలితే తక్షణ వైద్యానికి అవసరమయ్యేలా ఫస్ట్ ఎయిడ్ బాక్సులు కూడా ఏర్పాటు చేయని పరిస్థితులు ఉపాధి హామీ పనుల్లో కనిపిస్తోంది. ఏదిఏమైనా ఉపాధి హామీ పథకంకు సంబంధించి ప్రస్తుతం కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరం పరిష్కరించేలా స్థానిక ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సి ఉంది. లేకుంటే ఈ పథకం నిర్వీర్యం అయిపోయినా ఆశ్చర్యం లేదు. ఇకపోతే ఉపాధి హామీ కూలీలకు పనిదినాలు 100 రోజులను మరింతగా పెంచడం, కూలీ డబ్బులు ఇప్పుడిస్తున్న దాని కంటే మరింత పెంచడం, ప్రమాద బీమా లాంటి వసతులు కల్పించడం లాంటివి అమలయ్యేందుకు కృషి చేయాల్సిన అవసరం కనిపిస్తోంది.



ఉపాధి హామీ పనులు చేస్తున్న కార్మికులు

## మంత్రి ఆధ్వర్యంలో రేపు ఇఫ్తార్ విందు

### ముస్లిం మైనారిటీ సోదరి సోదరీమణులకు ఆహ్వానం

రాయచోటి మార్చి 26 ప్రభాతవార్త



రాయచోటి లోని సుండుపల్లె రోడ్డు పండ్ల మార్కెట్ వద్ద రేపు అనగా గురువారం సాయంత్రం 5.30 గంటలకు ఇఫ్తార్ విందుకు ముస్లిం మైనార్టీ చౌదరి సోదరులకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆహ్వానించారు. మంత్రి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఇఫ్తార్ విందుకు ప్రతి ఒక్కరు హాజరు కావాలని వాలని మంత్రి తెలియజేశారు.

### అన్నమయ్య జన్మస్థలి

## తాళ్లపాక అభివృద్ధికి కృషి చేస్తా

### టిడిపి జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రాజు



రాజంపేట అర్బన్, మార్చి 26 ప్రభాతవార్త

తొలి తెలుగు వాగ్గేయకారుడు పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుని జన్మస్థలి తాళ్లపాక అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్మోహన్రాజు అన్నారు. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల కీర్తిని ప్రపంచానికి చాటి చెబుదామని తెలియజేశారు. బుధవారం అన్నమాచర్ల 522వ వర్ధంతి సందర్భంగా తాళ్లపాక లోని అన్నమాచార్యుల వర్ధంతి వేడుకలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామికి అత్యంత ప్రియమైన భక్తునిగా పేరుందిన అన్నమాచార్యులు మన ప్రాంతం వారవడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. ఆయన ఖ్యాతితోపాటు ఆయన పుట్టిన నేలలో మనం తిరుగుతుండడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందన్నారు. ఆయన జన్మస్థలాన్ని ప్రపంచంలోనే ఒక ప్రఖ్యాత ప్రాంతంగా రూపుదిద్దుకునేలా ప్రతి ఒక్కరం కలిసి కృషి చేస్తామని ఆయన తెలియజేశారు. అన్నమాచార్యుల వర్ధంతి వేడుకలకు ప్రతి ఒక్కరూ హాజరై ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట రాజంపేట టిడిపి మండల అధ్యక్షుడు దగ్గుపాటి సుబ్రహ్మణ్యం నాయుడు. క్లస్టర్ ఇంచార్జ్ కొల్లి రెడ్డయ్య నాయుడు. టిడిపి నాయకులు సుబ్రహ్మణ్యం నాయుడు. టీఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్.తెలుగు యువత నాయకులు పాండురాజు, ఆనంద్, పరుశురాం నాయుడు,మోహన్, లక్ష్మీనారాయణ. లక్ష్మీనరసయ్య పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గదర్శకత్వంలో

## అన్నమయ్య జిల్లాలో 15 వృద్ధిరేటును సాధిస్తాం

**మామిడి పండ్ల రైతులకు ఒక రూపాయి సబ్సిడీ ద్వారా 9 రూపాయల ఆదాయం.**

**మూడవ కలెక్టర్ల సదస్సులో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి**

రాయచోటి, మార్చి 26 ప్రభాతవార్త

రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు గారి మార్గదర్శకత్వంలో అన్నమయ్య జిల్లాలో 15 వృద్ధిరేటును సాధిస్తామని మూడవ కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ముఖ్యమంత్రి కి వివరించారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన వెలగపూడి సచివాలయంలో 03వ కలెక్టర్ల సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు వెలగపూడి సచివాలయంలో అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పాల్గొన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ మరియు అన్ని శాఖలు జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి 202526వ సంవత్సరానికి గాను కార్యాచరణ ప్రణాళికను, జిల్లాలో ముఖ్యమైన సమస్యలను ముఖ్యమంత్రివర్యులకు వివరించారు. 202526వ సంవత్సరానికి గాను వ్యవసాయంలో మరో 13 వేల హెక్టార్ల పొలాలను విస్తరిస్తామని, ఉద్యానవనంలో సూక్ష్మ నీటిపారుదలను, పోస్ట్ హార్వెస్టింగ్ మౌలిక సదుపాయాలను మరింత మెరుగు పరుస్తామని వివరించారు. జిల్లాలో ఉన్న పశుసంపదకు అవసరమయ్యే గోకులం షెడ్లను పెంచుతామన్నారు. మామిడిపండ్ల ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజ్ యూనిట్లను పెంచడం వంటి కార్యక్రమాల ద్వారా వ్యవసాయంలో 17.54 వృద్ధిరేటు లక్ష్యాన్ని సాధిస్తామన్నారు. మామిడిపండ్ల రైతులకు ప్యాకేజింగ్ కు ఒక రూపాయి సబ్సిడీ ఇవ్వడం ద్వారా 9 రూపాయల ఆదాయాన్ని సంపాదించగలుగుతున్నారని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో మరో 214 ఎంఎస్ఎంఈ యూనిట్లను, అన్ని నియోజకవర్గాలలో ఎమ్మెస్సీని పార్కులను ఏర్పాటుచేసి పారిశ్రామిక అభివృద్ధిలో 16.65 శాతం లక్ష్యాన్ని సాధిస్తామన్నారు. పీఎం సూర్య ఘర్ పథకం ద్వారా పదివేల కుటుంబాలకు సోలార్ ప్యానల్ లను ఏర్పాటు చేస్తామని, పీఎం కుసుం పథకం ద్వారా మరో 28 వేల సోలార్ పంపులను వ్యవసాయదారులకు అందిస్తామని పేర్కొన్నారు. నరేగా పథకం ద్వారా మరో 160 కిలోమీటర్ల రహదారులను నిర్మిస్తామని, హౌసింగ్ పథకం ద్వారా 30 వేల నూతన ఇళ్లను నిర్మిస్తామని పేర్కొన్నారు. సేవా రంగంలో 16 వృద్ధిరేటు లక్ష్యం పెట్టుకున్నామని, పర్యాటక రంగాన్ని మరింత విస్తరించి అవసరమైన స్టార్ హోటళ్లు నిర్మించే దిశగా చర్యలు తీసుకొని లక్ష్యాలను పూర్తి చేస్తామన్నారు. అన్నమయ్య జిల్లాలోని హెచ్ ఎన్ ఎస్ ఎస్ రెండవ ఫేసు, ప్రాజెక్టుకు, వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుకు, అన్నమయ్య ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వ సహకారం అవసరమని పేర్కొన్నారు. ఉద్యానవన పంటలకు కోల్డ్ స్టోరేజ్ సదుపాయాలు, ప్యాకింగ్ హౌస్ సదుపాయాలు అవసరమని, వీటికి రాష్ట్ర ప్రభుత్వ సహకారం అవసరమని పేర్కొన్నారు. జిల్లాలో ఉద్యోగస్తుల కొరత ఉందని, ముఖ్యంగా రెవెన్యూ శాఖలో సిబ్బంది కొరత ఉందని పేర్కొన్నారు. హెచ్ ఎన్ ఎస్ ఎస్ ప్రాజెక్టును పూర్తి చేయడం ద్వారా మరో 19 మండలాలకు ఆయకట్టు భావిస్తుందని దీని ద్వారా ప్రజల సరాసరి ఆదాయం 45 వేలకు పైగా పెరుగుతుందని జిడిపి ర్యాంకింగ్లో 16వ ర్యాంకును సాధిస్తామని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన 700 కోట్ల రూపాయలను అందించవలసిందిగా కోరారు. అనంతరం, జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ జిల్లా స్థాయి అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చేసిన దిశ నిర్దేశం మేరకు జిల్లా అధికారులందరూ కార్యాచరణను రూపొందించుకొని, రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



### ఎవరు డైరెక్షన్‌లో

## యాక్షన్ చేస్తున్నారో ప్రజలకు తెలుసు

**సీబీఐ ,పోలీస్ అధికారుల చిత్రహింసలు భరించా**

**వైయస్ వివేకా పీఏ కృష్ణారెడ్డి**

పులివెందుల ,మార్చి 26,ప్రభాత వార్త:



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి డైరెక్షన్‌లో కృష్ణారెడ్డి యాక్షన్ అట అంటున్నారు అని ఎవరు డైరెక్షన్‌లో చేస్తున్నారో ఎవరు యాక్షన్ చేస్తున్నారో ప్రజలందరికీ తెలుసని మాజీమంత్రి వైయస్ వివేకానంద రెడ్డి పీఏ కృష్ణారెడ్డి అన్నారు. పులివెందుల పట్టణంలోని స్థానిక వైఎస్ఆర్ ప్రెస్ క్లబ్ నందు బుధవారం వివేకా పీఏ క్రిష్ణారెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈరోజు పత్రికల్లో వచ్చిన కొన్ని వార్తలు చూశాను అసలు అలాంటి రాతలు ఎలా రాయాలనిపిస్తోందో అర్థం కావడం లేదని అన్నారు. అవినాష్‌రెడ్డి డైరెక్షన్‌లో కృష్ణారెడ్డి యాక్షన్ అట అని రాశారు అని ఎవరు డైరెక్షన్ చేస్తున్నారో ఎవరు యాక్షన్ చేస్తున్నారో ప్రజలందరికీ తెలుసని వివేకా హత్య సమయంలో లెటర్ దొరికితే నర్రెడ్డి రాజశేఖర్ రెడ్డికి చెప్పాను ఆయన దానిని దాచిపెట్టమని చెబితే అలా చేస్తే సమస్య అవుతుందని చెప్పా కానీ నేను చెప్పినట్లు చేయమన్నాడని పేర్కొన్నారు. లెటర్ దాచిపెట్టమని చెప్పిన రాజశేఖరరెడ్డి మాత్రం బాగానే ఉన్నాడు. దానిని దాచిన నేను మాత్రం ఇబ్బందులు పడాలా అంటూ ప్రశ్నించారు. ఇప్పుడొచ్చి వాళ్ల నీతులు మాట్లాడుతున్నారు అని అన్నారు. డీటీసీలో నన్ను తీవ్రంగా కొట్టి హింసించారు. వివేక హత్య నర్రెడ్డి రాజశేఖరరెడ్డి చేశాడా అని నన్ను అడగడం, కొట్టడమే అక్కడ పని కొద్ది రోజులకు నన్ను రిమాండ్‌కు పంపారని అన్నారు. సీబీఐ వాళ్ల కేసు టేకప్ చేశాకా వాళ్లకు నేను అన్ని విషయాలు చెప్పి సహకరించాను.మార్చి 3 వ తేది 2021 వ తేదీన ఢిల్లీ నుంచి సీబీఐ అధికారులు డిల్లీలో సీజీఎస్ కాంప్లెక్స్‌లో సీబీఐ కార్యాలయంలో హాజరుకావాలని చెప్పారని అలా పిలుస్తారని నర్రెడ్డి రాజశేఖరరెడ్డి ముందే నాతో అన్నాడని తెలిపారు. అంటే వాళ్లకు ముందే అంతా తెలుసు తెలియనట్లు నా వద్ద డ్రామా ఆడారని నేను ఢిల్లీ వెళ్లడానికి కావాల్సిన ఫ్లైట్ టికెట్ కూడా నర్రెడ్డి రాజశేఖరరెడ్డే తీసిపెట్టాడని పేర్కొన్నారు. సునీత, నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, రాంసింగ్‌లు నన్ను బెదిరించలేదని ఆధారాలు చూపండి. రాంసింగ్ నన్ను కొట్టలేదని ఆధారాలు చూపండి. నన్ను కొట్టలేదని మీరు ప్రమాణం చేస్తారా అని నిలదీశారు. రాంసింగ్ నన్ను నా కొడుకుల ముందే నన్ను కొట్టింది మర్చిపోయాడా నన్ను అప్రూవర్‌గా మార్చడానికి ఫోన్లో ఒక సారి మాట్లాడాడని అన్నారు. ఢిల్లీలో, ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో కూడా కొట్టాడని నేను చెప్పింది తప్పు అని ఎక్కడైనా వాళ్లను ప్రమాణం చేయమనండి. నేను భగవద్గీత అయినా పట్టుకుంటా బైబిల్ అయినా పట్టుకుంటా వాళ్లు ఏ చర్చిలో ప్రమాణం చేయమన్నా చేస్తానని తెలిపారు. నేను ఢిల్లీ వెళ్లడానికి డబ్బులు కూడా నా ఎకౌంట్లో వేశారు. నెలరోజులు ఢిల్లీలో చిత్ర హింసలు పెట్టిన తర్వాత రిటన్ టికెట్ కూడా నర్రెడ్డి రాజశేఖరరెడ్డే పెట్టాడని అన్నారు. ఏదైనా ఉంటే నిజాన్ని నిర్భయంగా ఒప్పుకోవాలి. ఎవర్నో బలి చేయడానికి మరో మనిషిని బలిచేస్తారా అని అన్నారు. నన్ను బెదిరించారని, కొట్టారని పోలీసులకు, ఎస్పీకి ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదని అందుకే నేను పులివెందుల కోర్టులో ప్రైవేటు కంప్లైంట్ వేశానని పేర్కొన్నారు. ఆ కేసులో అప్పటి సీఐ రాజు మా ఇంటికి రెండు సార్లు వచ్చి 20 పేజీల స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారని చివరికి నన్ను ఒప్పించమని నా కొడుకును కూడా ఇబ్బంది పెట్టారని అన్నారు. నేను వెళ్లి సునీతతో మాట్లాడితే నాపై మండిపడ్డారని ఆ రోజు నేను వాళ్ల చెప్పినట్లు ఒప్పుకోకపోతే సునీత అన్నమాటలపై నాకు అనుమానం ఉందని కృష్ణారెడ్డి ఒప్పుకోకపోతే నువ్వు జైలుకు పోతావ్ అని తన ముందే భర్తను సునీత అన్నదని అన్నారు. నాకు ఏదైనా జరిగితే నర్రెడ్డి సునీత, రాజశేఖరరెడ్డి, శివప్రకాశ్‌రెడ్డిలే బాధ్యులని సునీత నేను వేసిన కేసుపై హైకోర్టుకు వెళితే తిరస్కరించారు. దీంతో సుప్రీం కోర్టుకు వెళ్లింది. ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం ఉందని చంద్రబాబు, హోంమంత్రి అనితతో మాట్లాడుకుని ఇలా చేస్తున్నారని అన్నారు. ఎలాగైనా నేను పెట్టిన కేసును కొట్టేయించుకోవాలని వాళ్ల చుట్టూ తిరుగుతోందని అవినాష్‌రెడ్డితో నేను మాట్లాడినట్లు ఎవరైనా ఆధారం చూపమనండి. పత్రికల్లో ఇష్టమొచ్చినట్లు రాయడానికి ఎవరు మీకు అధికారం ఇచ్చారని అన్నారు.

## వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

ప్రొద్దుటూరు మార్చి 27 ప్రభాతవార్త



ప్రొద్దుటూరు పట్టణం వికసిత ఫౌండేషన్ శూలం లక్ష్మీదేవి ఆధ్వర్యంలో వికాస్ విహార్ దివ్యాంగుల పాఠశాలలో బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శూలం లక్ష్మీదేవి మాట్లాడుతూ వృద్ధాశ్రమాలకు అనాధ స్కూల్ పిల్లలకు ,అన్నదానం చేయడం చాలా మంచిది అని ఇప్పటికీ మన ప్రొద్దుటూరు లో కొంత మందే అన్నదానాలు చేస్తున్నారని వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా చాలా మంది ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చదల రాము, కొండయ్య, మేడం ఝాన్సి పాల్గొన్నారు.

## నేడే కడప జెడ్పీ చైర్మన్ ఎన్నిక..!

### ఉత్కంఠగా మారిన కడప జెడ్పీ పీఠం ఎన్నిక...!!

కడప కార్పొరేషన్ మార్చి 26 ప్రభాతవార్త:



నేడు కడప జిల్లా పరిషత్ చైర్మన్ ఉప ఎన్నిక జరగనుంది. చైర్మన్ ఎన్నిక కోసం ఎన్నికల సంఘం ఈనెల 23న నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. నేడు అభ్యర్థుల నామినేషన్లు స్వీకరిస్తారు. మధ్యాహ్నం చైర్మన్‌ను ఎన్నుకుంటారు. ఉమ్మడి కడప జిల్లాలో 50 జడ్పీటీలు ఉన్నాయి. ఇందులో వైసీపీ 49 స్థానాలు గెలుచుకోగా.. టీడీపీ ఒక స్థానంలో విజయం సాధించింది. అయితే రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కి షాక్ తగిలింది. టీడీపీలో ఆరుగురు వైసీపీ జెడ్పీటీలు, బీజేపీలో ఒకరు చేరారు. ఇద్దరు మృతి చెందారు. ఒక జెడ్పీటీసీ రాజీనామా చేశారు. దీంతో కూటమి బలం 8 కి పెరిగింది. ప్రస్తుతం వైసీపీలో 38 మంది జెడ్పీటీసీలు కొనసాగుతున్నారు. బ్రహ్మంగారి మఠం జెడ్పీటీసీ రామగోవింద్ రెడ్డిని వైసీపీ అభ్యర్థిగా ప్రకటించారు. దాదాపు కడప జెడ్పీ చైర్మన్ పీఠం వైసీపీకి దక్కు అవకాశం ఉందని అంటున్నారు. కానీ వైసీపీకి అసంతృప్తి బెడద ఉంది. కొద్ది రోజులుగా కొందరు జెడ్పీటీసీలు అసంతృప్తిగా ఉన్నారని తెలుస్తోంది. ఇప్పుడు వీరిని కూటమి నాయకులు తమ వైపు ఆకర్షిస్తున్నట్లు సమాచారం. దీంతో కడప జెడ్పీ పీఠం ఎవరికి దక్కుందోనని కూటమి, వైసీపీ దిగువ స్థాయి నాయకులు టెన్షన్ పడుతున్నారు. వైసిపి సభ్యులను 30 మందిని హైదరాబాద్ క్యాంపు తరలించారు. 9 నెలల కిందటి వరకు ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి జెడ్పీ చైర్మన్‌గా వ్యవహరించారు. అయితే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆయన పదవికి రాజీనామా చేసి రాజంపేట ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. దీంతో 9 నెలలుగా శారదమ్మ ఇన్‌ఛార్జి జెడ్పీ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. అయితే ఇటీవల ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీకి షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో వైఎస్సార్సీపీ తరఫున బ్రహ్మంగారి మఠం మండలం జెడ్పీటీసీ రామగోవింద్ రెడ్డి బరిలోకి దిగనున్నట్లు ఇటీవల వైఎస్సార్సీపీ అధినేత జగన్ ప్రకటించారు. అయితే మిగిలిన సభ్యులు నిరాశ పడకుండా ఒక్కొక్కరికి 20 లక్షల రూపాయల చొప్పున ఇచ్చే విధంగా అనధికారికంగా ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. ఇప్పటికే సభ్యులందరికీ 5 లక్షల రూపాయల చొప్పున పంపిణీ చేసినట్లు టాక్ నడుస్తుంది. క్యాంప్ లో ఉన్న వైసీపీ జెడ్పీటిసి సభ్యులు నేరుగా కడప సమావేశానికి రానున్నారు.

## విచారణకు హాజరైన పవన్

### పోస్టుల వెనుక ఉన్నది ఎవరో అనే కోణం లో సాగిన విచారణ

పులివెందుల,మార్చి 26,ప్రభాత వార్త:

అవినాష్ అన్న యూత్ వాట్సప్ గ్రూప్ అడ్మిన్ పవన్ కుమార్ విచారణ కు హాజరు అయ్యారు, పోస్టుల వెనుక ఉన్నది ఎవరో అనే కోణం లో విచారణ సాగినట్టు తెలుస్తుంది. పోలీసుల విచారణ తీరు చూస్తుంటే పవన్ చుట్టూ ఉచ్చు బిగుస్తోందనీ తెలుస్తుంది. బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో పవన్ విచారణకు హాజరయ్యారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో నిందితుడైన సునీల్ యాదవ్ ఏ 2 ఫిర్యాదుతో పవన్ కుమార్‌పై పట్టణ పోలీస్ స్టేషన్ లో ఈనెల 22 వ తేదీన పోలీసులు కేసు నమోదు చేసి ఇదివరకే విచారించడం జరిగింది. ఇటీవల విడుదలైన హత్య సినిమాలోని సీన్‌లను అవినాష్ యూత్ వాట్సప్ గ్రూప్‌లో పదే పదే వైరల్ చేస్తున్నారని సునీల్ యాదవ్ ఫిర్యాదు లో పేర్కొన్నాడు. అంతేకాకుండా వైసీపీ కడప వాట్సాప్ గ్రూప్ అడ్మిన్, హత్య సినిమా డైరెక్టర్, నిర్మాత రైటర్‌తో పాటు మరికొంత మంది పై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇటీవల రిలీజ్ అయిన హత్య సినిమాలో తనను, తన తల్లిని క్రూరంగా చూపించారని, లేనివి ఉన్నట్లుగా సన్నివేశాలు చూపించారని, అదే సన్నివేశాలను అవినాష్ అనుచరుడు పవన్ అవినాష్ యూత్ వాట్సప్ గ్రూప్‌లో వైరల్ చేస్తున్నారని ఫిర్యాదు చేశారని , ఈ గ్రూప్‌లో తనను, తన కుటుంబాన్ని పదే పదే అవమానిస్తున్నారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల వైకాపా అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిసి డీఎస్పీ, సీఐ కొట్టారని పవన్ ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బుధవారం విచారణకు రావాల్సిందిగా పవన్ కు మంగళవారం పోలీసులు నోటీసులు ఇచ్చారు. దీంతో పోలీస్‌స్టేషన్‌కు హాజరైన పవన్‌ను డీఎస్పీ మురళి నాయక్ తో పాటు సిట్ సభ్యులు కూడా పవన్‌ను సుదీర్ఘంగా విచారించి నట్లు సమాచారం. పోస్టుల వెనుక ఎవరున్నారన్న కోణం లో పోలీసులు విచారణ చేసినట్లు సమాచారం. పవన్ పోలీసులకు చెప్పే సమాధానం బట్టి ఈ కేసు లో మరికొందరిని చేర్చే అవకాశం ఉంది. హత్య సినిమా సీన్‌లను వైరల్ చేసింది నిజమని తేలితే పవన్‌పై చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది

## వ్యవసాయ పొలంలో షెడ్డుకు నిప్పు



**రామసముద్రం మార్చి 26 ప్రభాతవార్త**

మండల కేంద్రంలో రైతు భరత్ రెడ్డికి చెందిన వ్యవసాయ పొలంలోని షెడ్డుకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. షెడ్ లోని వ్యవసాయ పనిముట్లు, స్ప్రేయర్, వైర్ రెండు వందల మీటర్లు, మల్చింగ్ పేపర్ పది కట్టలు,టమోటా చెట్లకు ఉపయోగించే నీమ్ ఆయిల్ ఏడు క్యాన్లు, ద్విచక్ర వాహనం, టిల్లర్ అగ్నికి ఆహుతి అయ్యాయి. విషయం తెలుసుకున్న రైతు అగ్నిమాపక సిబ్బంది సమాచారం అందించారు. వారు వచ్చేలోపు అన్ని వస్తువులు కాలి బూడిద అయ్యాయి. సీఐ సత్యనారాయణ, ఎస్సై రవికుమార్ సంఘటనా స్థలాన్ని సందర్శించిన వివరాలు సేకరించారు.బాధిత రైతు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. సీఐ సత్యనారాయణ, ఎస్సై రవికుమార్ మాట్లాడుతూ ఈ ఘటన సంబందించిన వ్యక్తులను త్వరగా పట్టుకుంటామని ఎంతటి వారినైనా ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు.

## నవోదయ పరీక్షకు ఎంపికైన శ్రీ సాయి వికాస్ విద్యార్థి

**చిట్వేలి, మార్చి 26, ప్రభాతవార్త:**

గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వ పరిధిలో నిర్వహించే జవహర్ నవోదయ పరీక్ష ఫలితాలలో 5వ తరగతి చదువుతున్న తమ పాఠశాల విద్యార్థి ఎ.అరుణ్ జోషిత్(11) ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ తిరుమల రెడ్డయ్య బుధవారం తెలియపరిచారు. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) అనుసంధానంతో ప్రమాణాలతో కూడిన ఉచిత విద్యను అందించే ఈ పరీక్షల్లో తమ విద్యార్థి అర్హత పొందడం హర్షనీయమని కరస్పాండెంట్ అన్నారు. 108 అత్యవసర వాహనంలో సాంకేతిక సహాయకుడిగా సేవలందిస్తున్న విద్యార్థి తండ్రి రవి ప్రకాష్ ఆనందం వ్యక్తం చేశారు.

## మనుషులంతా సమానమేనని చాటిన అన్నమయ్య

**ప్రొద్దుటూరు అర్బన్, మార్చి 26 ప్రభాతవార్త:**



స్థానిక అగస్తేశ్వరాలయంలో పదకవితా పితామహుడు, తొలి తెలుగు సంకీర్తనా చార్యులు తాళ్ళపాక అన్నమాచార్యుల 522వ వర్ధంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు పూర్వ సభ్యులు చిప్పగిరి ప్రసాద్,డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డి అన్నమయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అన్నమాచార్య కళాపీఠం గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ అన్నమయ్య 32వేల సంకీర్తన పుష్పాలను అందించారు. సువ్వి పాటలు, పెండ్లి,నివాళి పాటలలో తెలుగువారి ఆచార సంప్రదాయాలు కళ్లకు కట్టినట్లు వర్ణించారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ భాగవతార్ ఎడవల్లి రమణయ్య, అగస్త్యేశ్వరాలయ చైర్మన్ కొత్తమిద్దె రఘు రామిరెడ్డి,రాష్ట్ర బాషోపాధ్యాయ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు అంకాల్ కొండయ్య, ఉపాధ్యక్షులు సాయికుమార్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పరిశీలన గృహం తనిఖీ

**కడప లీగల్, మార్చి 26, ప్రభాతవార్త:**

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జీ ఎస్.బాబాఫకృద్దీన్ బుధవారం నగరంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహం మరియు ప్రభుత్వ పరిశీలన గృహాన్ని విజిట్ చేయడం జరిగింది. తరగతి గదులను పరిశీలించి పిల్లలు ఏఏ తరగతులను అభ్యసిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులలో విద్యార్థులు అభ్యసిస్తున్న పాఠ్యాంశాలను పరిశీలించారు. విద్య విలువైనది. క్రమశిక్షణతో అభ్యసించాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పిల్లలకు అందుతున్న భోజన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. న్యాయ సేవల పథకం 2024 గురించి వివరించారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100, చైల్డ్‌లైన్ హెల్ప్‌లైన్ నెంబర్ 1098 తెలిపారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారి దృష్టికి తీసుకొని రావచ్చున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర వసతి గృహం మరియు ప్రభుత్వ పరిశీలన గృహాన్ని సూపరింటెండెంట్ వీరయ్య, వైద్యాధికారి, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## మధ్యవర్తిత్వంపై గంట శిక్షణా కార్యక్రమం

**కడప లీగల్, మార్చి 26, ప్రభాతవార్త:**

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి సూచనల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జీ ఎస్.బాబాఫకృద్దీన్ మరియు పీజీ సురేష్, రీసోర్స్ పర్సన్/ట్రైనర్, కేరళ వారు కడప బార్ అసోసియేషన్ హాలులో మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు ఒక గంట శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యవర్తిత్వం అనేది ఒక ప్రక్రియ. ఇది వివాదాలను పరిష్కరిస్తున్న మంచి పద్ధతి. ఇది ఖర్చు మరియు సమయాన్ని ఆదా చేస్తుందన్నారు. ప్రాథమిక నియమాలు, అభ్యసం, అభ్యాస సూత్రాలు, వయోజన అభ్యాసం, శిక్షణ, మధ్యవర్తిత్వ శిక్షణ, నిర్వహణ పరిష్కారం, పాత్ర పోషించడం, సెక్షన్ 89కి ప్రత్యేక సూచనతో ఏడీఆర్ ఔచిత్యం, పౌర విధాన నియమావళి, 1908, మధ్యవర్తిత్వం మరియు మధ్యవర్తిత్వం ప్రతిఘటన, మధ్యవర్తిత్వం మరియు లోక్ అదాలత్‌కు మధ్య వ్యత్యాసం, ప్రయోజనాల మధ్యవర్తిత్వాలు, పాత్ర పోషించడం-1, కాకస్ మరియు ముగింపు పరిష్కారం, పరిష్కారం కానిది తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పీజీ సురేష్, రీసోర్స్ పర్సన్, ట్రైనర్, కేరళ, జి.జ్యోతి, రీసోర్స్ పర్సన్/ట్రైనర్, కేరళ మరియు న్యాయవాదులు పాల్గొన్నారు.

## మాజీ సీఎం జగన్‌ను కలిసిన మున్సిపల్ చైర్మన్

**బద్వేలు అర్బన్, మార్చి 26 (ప్రభాతవార్త):**



విజయవాడలోని తాడేపల్లి వైసీపీ కార్యాలయంలో బుధవారం మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను ఎమ్మెల్సీ గోవిందరెడ్డి కలిసి మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి కలిసి బద్వేలు మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయనకు వివరించారు. వాటి పరిష్కారానికి కృషి చేయాల్సిందిగా కోరారు. అలాగే వైసీపీ హయాంలో బద్వేలు మున్సిపాలిటీ రోడ్లు, విద్యుత్ తదితర విప్లవాత్మక అభివృద్దిని గురించి ఆయనకు వివరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఇంటిపన్ను వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోండి

### మున్సిపల్ కమీషనర్ ప్రమీల

**మదనపల్లె, మార్చి 26 ప్రభాతవార్త :**



మున్సిపల్ ఆస్థిపన్నుకు సంబంధించి ప్రభుత్వం కల్పించిన 50శాతం వడ్డీ రాయితీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమీషనర్ ప్రమీల తెలిపారు. బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ మున్సిపాలిటిలో ఆస్థిపన్ను బకాయిలు ఉన్న వారికి ప్రభుత్వం 50శాతం వడ్డీ రాయితీని ప్రకటించిందన్నారు. ఆస్థిపన్ను బకాయిలకు 50శాతం వడ్డీ రాయితీ వర్థించాలంటే బకాయిలతో సహా మొత్తం ఒకేసారి చెల్లించల్సి ఉంటుందన్నారు. ఈనెల 31లోగా మొత్తం పన్ను బకాయిలు చెల్లిస్తేనే వడ్డీరాయితీ వర్తిస్తుందన్నారు. ఆస్థిపన్ను వసూళ్ళకు సంబంధించి మున్సిపాలిటిలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. సెలవు దినాల్లో కూడా బకాయిలు చెల్లించవచ్చునన్నారు. వారపుసంతకు నిర్వహించిన వేలంపాటల ద్వారా మున్సిపాలిటికి రూ.46.33లక్షలు ఆదాయం వచ్చిందన్నారు. మున్సిపల్ పన్ను బకాయి దారులు ప్రభుత్వం ప్రకటించిన రాయితీని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## అంగళ్ళులో ముస్లింలకు ఇఫ్తార్ విందు

### అధికసంఖ్యలో హాజరైన ముస్లిం మైనార్టీ సోదరులు



ఇఫ్తార్‌విందులో పాల్గొన్న ముస్లిం సోదరులు

**కురబలకోట, మార్చి 26 ప్రభాతవార్త :**

మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని కురబలకోట మండలం అంగళ్ళుకు సమీపాన ఉన్న మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. అంగళ్ళులోని జామియా మసీదు వద్ద ఇఫ్తార్‌విందును సాయంత్రం ముస్లిం సోదరులకు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ముస్లిం సోదరులు భారీగా పాల్గొన్నారు. రంజాన్ మాసం సందర్భంగా మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం ముస్లిం మైనార్టీ సోదరులకు ఇఫ్తార్‌విందును ఏర్పాటు చేయడం పట్ల పలువురు ముస్లిం సోదరులు కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. ఇఫ్తార్ విందుకు రెవెన్యూ డివిజన్ పరిధిలోని తంబళ్ళపల్లె, మదనపల్లె, పీలేరు నియోజకవర్గ పరిధిలోని పలువురు ముస్లింసోదరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రియాజ్, శ్రీనివాస్, మహేష్, షరియాజ్, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న సబ్సిడీ విత్తనాలు పంపిణీ

**రామసముద్రం, మార్చి 26 ప్రభాతవార్త :**

రామసముద్రం మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రంలో పాడి రైతులకు బుధవారం 40శాతం సబ్సిడీచే మొక్కజొన్న విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారిని డాక్టర్ దివ్య, పశువైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొనడం జరిగింది.

## రేపే వారపు సంత వేలం

**సుండుపల్లె, మార్చి 25, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని కూరగాయలు సంత పశువుల సంత వేలం పాట 2025,26 సంబందించి ఈ నెల 28 వ తేది అనగా రేపే నిర్వహిస్తున్నట్లు ఈ ఓ పి ఆర్డి సురేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కూరగాయలు సంతకు డిపాజిట్ 70వేలు రూపాయలు, పశువుల సంతకు 25 వేలు రూపాయలు శుక్రవారం ఉదయం 10 నుండి ఒంటి గంట లోపు మొత్తం నగదు లేదా డిడి రూపంలో చెల్లించి పంచాయతీ కార్యాలయంలో తమ పేర్లను అదే రోజు ఉదయం మధ్యాహ్నం ఒంటి గంటలోపు నమోదు చేసుకోవాలని కోరారు. కూరగాయల మార్కెట్, పశువుల సంత వేలం పాట రెండు అదే రోజు మధ్యాహ్నం 2:30 లకు వేలం ప్రారంభం అవుతుంది డిపాజిట్లు కట్టినవారు పాల్గొనడం జరుగుతుంది ఇతరులకు ప్రవేశం లేదు. ఈ విషయాన్ని మండల ప్రజలు గుర్తించుకొని పాల్గొనవచ్చని తెలియజేశారు.

## నేడు పీలేరు మండల కో ఆప్షన్ సభ్యుడి ఎన్నిక

**పీలేరు మార్చి 26 ప్రభాతవార్త ;;**

పీలేరు మండల ప్రజా పరిషత్ పాలకమండలిలో కోఆప్షన్ సభ్యుడి ఎన్నిక కోసం నామినేషన్లు స్వీకరించనున్నట్లు ఎన్నికల అధికారి అమర్నాథ్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పీలేరు మండల ప్రజా పరిషత్ కు ఉన్న కోఆప్షన్ సభ్యులు మృతి చెందడంతో కొత్తగా మరో కో ఆప్షన్ సభ్యుడిని ఎందుకు అవడం కోసం, గురువారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కో ఆప్షన్ సభ్యుడు నామినేషన్లను స్వీకరించడం జరుగుతుందని అన్నారు. 12 గంటలకు నామినేషన్ల పరిశీలన, అనంతరం మధ్యాహ్నం ఒంటిగంటకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కో ఆప్షన్ సభ్యుడిని ఎంపీటీసీలు ఎన్నుకోవడం జరుగుతుంది అని తెలియజేశారు. ఆసక్తి గల అభ్యర్థులు నామినేషన్ పత్రాలను దాఖలు చేసుకోవాలని తెలియజేశారు.

## వేలంపాటలో పెరిగిన పంచాయతీ ఆదాయం



**దువ్వూరు, మార్చి 26, ప్రభాతవార్త:**

మేజర్ గ్రామ పంచాయతీ అయిన దువ్వూరులో జరిగిన బస్టాండ్ దినసరి కాంప్లెక్స్ వేలంపాటలో గత ఏడాది కంటే ఈ ఏడాది లక్ష 15వేల రూపాయల ఆదాయం పెరిగింది. బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో బస్టాండ్ దినసరి కాంప్లెక్స్ రూముల వేలంపాటను నిర్వహించారు. ఈ వేలం పాటల్లో బస్టాండ్, దినసరి మార్కెట్‌ను రాఘవేంద్రా దక్కించుకోగా, కాంప్లెక్స్ రూములను వేలంపాటలో ఎక్కువ పాడిన వారికి కేటాయించారు. ఈ మూడింటిలో గత ఏడాది 2లక్షల 14వేల ఆదాయం రాగా ఈ ఏడాది 3లక్షల 30వేలు ఆదాయం వచ్చినట్లు పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. ఏప్రిల్ 1వ తేది నుంచి వీరు మార్కెట్‌లో పనులు చేసుకుంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి హరికృష్ణ, సర్పంచ్ చంద్రాయుడులు పాల్గొన్నారు.

## ఉపాధిలో కూలీల సంఖ్యను పెంచాలి



**దువ్వూరు, మార్చి 26, ప్రభాతవార్త:**

మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సభా భవణంలో ఉపాధి హామీ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఆయన మాట్లాడుతూ కేవలం మండలంలో 1100మంది మాత్రమే పనిచేస్తున్నారని ఈ సంఖ్యను 2వేలకు పెంచాలన్నారు. పనిచేసే సమయంలో మస్టర్‌లలో కొట్టివేతలు ఉండరాదన్నారు. పనికి వెల్లే సమయంలోనూ, ఇంటికి వచ్చే సమయంలోనూ ఫోటోలు తీసి అప్‌లోడ్ చేయాలన్నారు. అలాగే ఉపాధి హామీకి సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ సమీక్షలో ఇంచార్జ్ ఏపీఓ లక్ష్మీనారాయణ, ఈసి ప్రియాంక, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతుల కోసం చూపిన చొరవను అభినందించిన ముఖ్యమంత్రి

**రాయచోటి మార్చి 26 ప్రభాత వార్త**

అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మామిడి రైతుల కోసం చూపించిన చొరవను రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. బుధవారం సాయంత్రం అమరావతిలో నిర్వహించబడుతున్న మూడవ కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్ శ్రీధర్ జామకూరి జిల్లా అంశాలపై ముఖ్యమంత్రివర్యులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో మామిడి రైతులు ఎక్కువగా ఉన్నారని వారు పండించిన బేనీషా పళ్లకు ప్యాకింగ్ కోసం ఒక రూపాయల సబ్సిడీ ఇవ్వడం ద్వారా వారు 9 రూపాయల ఆదాయాన్ని సంపాదించగలుగుతున్నారని వివరించారు. ఈ విషయంపై వెంటనే స్పందించిన రాష్ట్రముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ఈ విషయాన్ని సమగ్రంగా పరిశీలించి మిగతా జిల్లాలలో అమలు పరచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## నీటి ఎద్దడి శాశ్వత పరిష్కారం

**సిద్దవటం, మార్చి 26, ప్రభాతవార్త:**

ప్రజల తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం దిశగా 15వ ఆర్థిక సంఘం నిధులతో వేగవంతంగా పనులు జరిగాయి. మండలంలోని మాధవరం-1 మహబూబ్ నగర్, అలీ నగర్ గ్రామాల ప్రజల నీటి సమస్య పరిష్కారం కోసం గ్రామ సర్పంచ్ జానకీ రామయ్య అధ్యక్షతన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.95లక్షలు నూతన మోటారు మరియు పైపులైను ఏర్పాటు చేసి ప్రజల నీటి సమస్య పరిష్కారం చేస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం రాజంపేట నియోజకవర్గ తెదేపా ముస్లిం మైనార్టీ అధ్యక్షులు డా.వీరభద్రుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రజల సమస్యలు పరిష్కారం అవుతున్నాయని గత వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీలు అభివృద్ధి చెందలేదని గ్రామాల్లో ప్రజల సమస్యలు పరిష్కారం దిశగా రాష్ట్ర సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గ్రామాల్లో ఉన్నప్రజల సమస్యలపై పరిష్కారం దిశగా తగు చర్యలు తీసుకుంటున్నారని మాధవరం గ్రామంలో ప్రజలకు నీటి సమస్య పరిష్కారం దిశగా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రటరీ లక్ష్మీ నరసయ్య, హరి, మురళీ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి ఎద్దడి ఎదుర్కొంటాం



**సిద్దవటం, మార్చి 26, ప్రభాతవార్త:**

వేసవి కాలం దృష్టిలో పెట్టుకొని ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా పరిష్కారం దిశగా ముందుకెళ్తామని మండల అభివృద్ధి అధికారి ఫణి రాజకుమారి తెలిపారు. మండలంలోని చాముండేశ్వరీపేట గ్రామంలో బుధవారం స్పెషల్ డ్రై ప్రోగ్రాంలో మండల అభివృద్ధి అభివృద్ధి అధికారి ఫణిరాజకుమారి మాట్లాడుతూ గ్రామంలో అపరిశుభ్రత లేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యత వహించి గ్రీన్ అంబాసిడర్ వాహనంలో చెత్త వెయ్యాలని వేసవి దృష్టిలో పెట్టుకొని తాగునీటి ఎద్దడి రాకుండా పరిష్కారం చేస్తామని గ్రామంలో ఏదైనా సమస్య ఉంటే సచివాలయంలో ఫిర్యాదు చేయాలని ఆమె అన్నారు. అనంతరం గత ఏడాది ఆగస్టు నెలలో రూ.20వేలు ఉపాధి హామీ నిధులతో హార్టికల్చర్ ద్వారా మహిళ రైతు కరీం మున్నీసా ఒక ఎకరా పొలంలో సాగు చేసిన నిమ్మ తోటను పరిశీలించి సలహాలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీవో నరసింహులు, పంచాయతీ రాజ్ ఏఈ నాగరాజు టెక్నికల్ అసిస్టెంట్ ఓబుల్‌రెడ్డి, నేకనాపురం సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పనులు వేగవంతం చేయండి



**సిద్దవటం, మార్చి 26, ప్రభాతవార్త:**

మండలంలోని నేకనాపురం గ్రామంలో జరుగుతున్న పనులను పంచాయతీరాజ్ ఏఈ నాగరాజు తనిఖీ చేసి పనులు వేగవంతంగా చేయాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం పంచాయతీరాజ్ ఏఈ నాగరాజు మాట్లాడుతూ గ్రామంలో పంచాయతీ కాంపౌండ్ వాల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో బండ పరుపు గాను లక్ష రూపాయల నిధులతో పనులు జరుగుతున్నాయని పనులు వేగంగా చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## పోషన్‌బీ పై శిక్షణా కార్యక్రమం ముగింపు



**బద్వేలు అర్బన్, మార్చి 26 (ప్రభాతవార్త):**

పట్టణంలోని అంగన్వాడీ కార్యకర్తలకు పోషన్‌బీ- పఢై భీ అనే అంశంపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ మేరకు అంగన్వాడీ కార్యకర్తలనుద్దేశించి సీడీవో శ్రీదేవి మాట్లాడుతూ ఆధార్ శిల, నవచేతన్ అనే నూతన కార్యక్రమం గురించి తెలిపారన్నారు. అలాగే ఇంటి వద్ద కుటుంబ సభ్యులు చేపట్టవలసి కార్యక్రమం బోధనా సామాగ్రి తయారి అంశాలపై వివరించారు. దివ్యాంగ పిల్లల కోసం అంగన్వాడీ వర్కర్లకు ఫ్రోటోకాల్ భవిత కేంద్రం వర్కర్లకు తెలియజేశారు. 3 నుంచి6 సంవత్సరాల పిల్లల పోషకాహారం, సమత్యులత ఆహారం మరియు ఆహర వైవిద ప్రాధాన్యత గురించి తెలిపారు. ఈకార్యక్రమంలో డాక్టర్ సౌమ్య, ప్రాజెక్టు సూపర్‌వైజర్ సుబ్బలక్షుమ్మ, సుగుణ, విజయమ్మ, లక్ష్మిదేవి, సువర్ణ, సి.హెచ్. అరుణలతో పాటు 175 మంది అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రంజాన్ తోఫా పంపిణీ



**ప్రొద్దుటూరు అర్బన్, మార్చి 26 ప్రభాతవార్త :**

స్థానిక మహమ్మద్ కాలనీ మెరుగుపని షబ్బీర్ కుటుంబ సభ్యులు హిందూ ముస్లిం క్రైస్తవులకు అన్ని మతాల వారికి కులామతాలకు అతీతంగా బుధవారం రంజాన్ తోఫ పంపిణీ చేసారు.రంజాన్ సందర్భంగా పండగ దినమున సన్న బియ్యం, చక్కెర, గోధుమపిండి, సేమ్యాలు, నెయ్యి, జకాత్ ,ఫీత్ర ,బట్టలు ,మొదలగు పంపిణీ చేసారు.అందరూ సుఖసంతోషాలతో రంజాన్ రోజున వండుకుని తినాలని,అల్లా తో దువా చేస్తున్నామని,హిందూ ముస్లిం క్రైస్తవులు అన్ని కులాలు అన్ని మతాలవారు బాగుండాలని కష్టం దూరం అవ్వాలని సంతోషంగా ఉండాలని అల్లాతో దువా చేస్తున్నామన్నారు. ఈ పంపిణీ కార్యక్రమం చూసి మరి కొంతమంది దాతలు ఇలాంటివి కార్యక్రమాలు చేయాలని ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం ఉన్నారు. ఈ కార్యక్రమంలో షబ్బీర్, షాహుల్, దిల్ కుష్ సుజిత్,సుబ్బయ్య, జమాల్ వలి,ఖజా హుస్సేన్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అలసట లేకుండా పని చేయాలంటే !



**ఉదయాన్నే నిద్ర లేచింది మొదలు.. ఊపిరి సలపని పనులు.. క్షణం తీరికుండదు.. ఒత్తిడి, అలసట.. ఈ విధంగా అలసట రాకుండా ఉండాలంటే శరీరంలో తగినంత శక్తి ఉండాలి. మరి ఆ శక్తి రావాలంటే ఏం చేయాలి?**

ప్రొటీన్లు మెండుగా ఉండే ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి. ఇలా చేయడం వల్ల శరీర కండర వ్యవస్థ దృఢమవుతుంది. దీంతో ఎలాంటి అలసట లేకుండా సునాయాసంగా పనులు చేసుకోవడం సాధ్యమవుతుంది. అలాగే ప్రొటీన్లు గుండె బలంగా ఉండేందుకు, రోగ నిరోధకశక్తిని పెంపొందించేందుకూ దోహదం చేస్తాయి. అవసరమైన మేరకు ప్రొటీన్లు లభించే ఆహారం తీసుకుంటే తక్కువ క్యాలరీలతోనే కడుపు నిండిన భావన కూడా కలుగుతుంది.

**నట్స్...** ప్రొటీన్లతో నిండిన బాదం పప్పు, పిస్తా, అక్రోట్ వంటి గింజలను ప్రతిరోజూ పరిమితంగా తీసుకోవడం మంచిది. అవి గుండెకు మేలు చేస్తాయి. సలాడ్లు కూరగాయలతో కూడా వీటిని కలుపుకొని తినొచ్చు. అయితే నట్స్‌లో క్యాలరీలు కూడా ఎక్కువగానే ఉంటాయి కాబట్టి మితంగానే తీసుకోవాలి.



**పాలు, పాల పదార్థాలు ...** ...కండరాల నిర్మాణానికి తోడ్పడే ప్రొటీన్లు పాల పదార్థాల్లో పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్తపోటు తగ్గటానికి తద్పడతాయి. ఈ క్రమంలో తక్కువ కొవ్వు ఉండే పాల పదార్థాలను తీసుకోవాలి.

**సోయాబీన్స్..** సోయాబీన్స్‌లో ప్రొటీన్ల మోతాదు ఎక్కువ. వీటిని సోయా పాలు, సోయా పేస్ట్, టోఫూ రూపంలోనూ తీసుకోవచ్చు. మామూలు పాలలో మాదిరిగానే సోయా పాలలోనూ ప్రొటీన్ ఉంటుంది. అయితే ఇవి కొంతమంది పడకపోవచ్చు. అలాంటి తీసువకునే విషయంలో వైద్యులను సంప్రదించాలి.



- ✦. అలాగే బఠానీలు, రాజ్మా, బీన్స్, చిక్కుళ్లు, ఇతర కూరగాయల్లోనూ ప్రొటీన్ ఉంటుంది.
- ✦ చేపల్లో ప్రొటీన్లతో పాటు గుండెకు మేలు చేసే ఒమేగా కొవ్వు ఆమ్లాలూ ఎక్కువగానే ఉంటాయి.
- ✦ ఇతర మాంసాహార పదార్థాల్లో కూడా ప్రొటీన్లు దండిగా ఉంటాయి. అయితే వీటిల్లో కొవ్వు కూడా ఎక్కువగా ఉంటుంది. కాబట్టి మితంగానే తినాలి. ఈ క్రమంలో చర్మం తీసేసిన చికెన్ తీసుకోవడం మంచిది.



అలాగే కోడి గుడ్డులో కూడా ప్రొటీన్ ఉంటుంది.కానీ కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్నవారు, గుండెజబ్బు, మధుమేహం వంటి సమస్యలు ఉన్నవారు డాక్టర్ల సలహా మేరకే ఎన్ని గుడ్లను తినొచ్చో నిర్ణయించుకోవాలి.

## వేలం పాటలు సీసీ కెమెరాల నిఘాలో నిర్వహించాలి

**పీలేరు మార్చి 26 ప్రభాతవార్త :**

గ్రామ పంచాయతీ వేలం పాటలను సీసీ కెమెరాల పర్యవేక్షణలో పారదర్శకంగా నిర్వహించాలని ఎన్ఎస్యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత తేజ పంచాయితీ ఈవోకు వినతిపత్రం సమర్పించారు. బుధవారం ఆయన ఈవోను తన కార్యాలయంలో కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. పీలేరు గ్రామపంచాయతీ పరిధిలోని షాపింగ్ గదులు, వారపు సంత, దినసరి కూరగాయల మార్కెట్, ప్రైవేట్ బస్టాండ్, జంతువుల వధశాల, మాంసపు అంగళ్ళకు సంబంధించి గురువారం అటెండర్లు నిర్వహించనున్నారు. అయితే ఈ బహిరంగ వేలంపాటలను సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహించాలని, టెండర్ కాల పరిమితిని మూడేళ్లకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఆయన పంచాయితీ ఈవో గురు మోహన్ కు వినతిపత్రం సమర్పించారు. ఎన్.ఎస్.యూ.ఐ రా ష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల.అమృత్ తేజ ఆధ్వర్యంలో పీలేరు మేజర్ గ్రామపంచాయతీ ఈవో గురు మోహన్ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అమృత్ తేజ మాట్లాడుతూ పీలేరు గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి 19వ తేదీన పరిధిలోని షాపింగ్ గదులు, వారపు సంత, దినసరి మార్కెట్, ప్రైవేట్ బస్టాండ్, జంతువుల శాల మాంసపు అంగళ్ళకు సంబం6ధించి బహిరంగ వేలంపాట నిర్వహించడానికి ప్రకటన జారీ చేసిన విషయంగా అందరికీ విధితమే అన్నారు. ఈ వేలంపాట ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, న్యాయంగా ఉండాలి అంటే సీసీ కెమెరాల పర్యవేక్షణలో వేలంపాటలు నిర్వహించాలని విన్నవించా. అదనంగా, గ్రామపంచాయతీ షాపింగ్ గదుల టెండర్ కాల పరిమితి ఒక సంవత్సరం కాకుండా కనీసం మూడు



పంచాయతీ ఈవోకు వినతిపత్రం ఇస్తున్న ఎన్ ఎస్ యు ఐ నాయకులు

సంవత్సరాలకు పెంచాలని కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం ఎన్.ఎస్.యూ.ఐ తరపున అమృత్ తేజ కోరారు. ఇలా చేయడం వల్ల వ్యాపారస్తులకు స్థిరమైన వాణిజ్య అభివృద్ధి సాధ్యమవుతుందని, అలాగే పంచాయతీకి స్థిరమైన ఆదాయం లభిస్తుందని అన్నారు. ప్రతి సంవత్సరం టెండర్ నిర్వహించడం వల్ల అనవసర ఖర్చు, అనిశ్చితి, లీజుదారులకు సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు టెండర్ గడువు పెంపు ఉపయోగపడుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.యూ.ఐ నాయకుల మహేష్, మంజునాథ్, భాను, లిఖిత్, ఆదిత్య, స్వామి, సాయి తదితరులు పాల్గొన్నారు.

## దాల్మియా పరిశ్రమ 2వ ప్లాంట్ కోసం ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు

**జమ్మలమడుగు, మార్చి 26, ప్రభాతవార్త:**

దాల్మియా పరిశ్రమ రెండో ప్లాంట్ కోసం గురువారం ఏర్పాటు చేయనున్న ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు కార్యక్రమంపై స్థానిక గ్రామాల ప్రజలకు జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి, ఆర్డీవో సాయిశ్రీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలను సామరస్యంగా తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

## పేరు మార్పు

షేక్ అనూస్ అహ్మద్ (పాత పేరు) డోర్ నెం. 30/198-1-2 ఉక్కాయపల్లి, చిన్న చౌక్, కడప సిటీ, వైయస్సార్ కడప జిల్లా, ఏపీ. నా కొత్త పేరు షేక్ అనస్ అహ్మద్‌గా మార్చుకోబడనది. నా కొత్త పేరు షేక్ అనస్ అహ్మద్.

## నవోదయ పరీక్షల్లో గగన సింధు విజయం



పుల్లంపేట మార్చి 26 ప్రభాతవార్త

నవోదయ ప్రవేశ పరీక్షలలో పుల్లంపేట ప్రత్యూష హైస్కూల్‌కు చెందిన గగన సింధు విజయం సాధించినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ కాసల భాను ప్రసాద్ ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. గారాలమడుగు గ్రామపంచాయతీ సీత రాజంపేట గ్రామానికి చెందిన సింధు ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ప్రత్యూష హైస్కూల్ లోనే చదువుతోంది. ఆరో తరగతిలో చేరేందుకు నవోదయ ప్రవేశ పరీక్షలను ఆ బాలిక రాసినట్లు తెలిపారు .మంగళవారం విడుదలైన నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఈమె విజయం సాధించినట్లు ఆయన పేర్కొన్నారు .ఈ పాప తండ్రి ఉమ్మడి జానకిరామ్ ఫోటోగ్రాఫర్ గా పని చేస్తున్నా రన్నారు. సింధు నవోదయ ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణత కావడం పైన ఆ పాఠశాల లోని ప్రధానోపాధ్యాయుడు సుబ్బ నరసింహులు పలువురు ఉపాధ్యాయులు రవీంద్రబాబు, షబీనా, నాగలక్ష్మి ,రాధా ,సరళమ్మ ,ప్రసన్న, బాబు ,వాసు దేవరాజు ,పలువురు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. గగన సింధు నవోదయ పరీక్షల్లో విజయం సాధించడం పట్ల సీతారాంపేట గ్రామానికి చెందిన పలువురు ప్రజలు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు

## 28న బహిరంగ వేలం

ముద్దనూరు, మార్చి 26, ప్రభాతవార్త:

పట్టణంలోని మేజర్ గ్రామపంచాయతీ జంతువధశాల, బస్టాండ్ కు సంబంధించి మార్చి 28వ బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనరసింహులు బుధవారం నాడు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనములు లోడింగ్ అన్ లోడింగ్ రుసుము డిపాజిట్ రూ. 4 లక్షల రూపాయలు మరియు జంతువధశాలకు 40 వేల రూపాయలు డిపాజిట్ చేసి వేలంపాటలో పాల్గొనవచ్చునని తెలిపారు గ్రామ పంచాయతీ పరిధిలోని నిబంధనల మేరకే వేలంపాటలో పాల్గొనాలన్నారు. గ్రామ పంచాయతీ నిర్ణయించిన ధరల కన్నా ఎక్కువ రాబడితే వారి లైసెన్స్ ను రద్దు చేసే అవకాశం ఉందని వేలంపాటలో పాల్గొనవలసిన వారు గమనించవలసిందిగా తెలిపారు. మరింత సమాచారం కొరకు గ్రామపంచాయతీ కార్యాలయ సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

## అవార్డు గ్రహీతలకు సన్మానం

ప్రొద్దుటూరు అర్బన్, మార్చి 26, ప్రభాతవార్త:



విజయవాడల్లో హనుమంతరాయ గ్రంథాలయ ఆడిటోరియంలో గిన్నిస్ బుక్ రికార్డు అవార్డు గ్రహీత పద్మశ్రీ డాక్టర్ ఎల్లా వెంకటేశ్వరరావు( మృదంగం) ను, టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ ఆస్థాన గాయకులు గురజాడ మధుసూదన్‌ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఏపీ అసెంబ్లీ ఓఎస్‌డిఎం ప్రభాకర్‌ను ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలుగు కళావాహిని సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అలాగే అభినవ అన్నమాచార్య గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ కి సంతాపం ప్రకటించారు. కార్యక్రమంలో కవులు, రచయితలు, గాయకులు పాల్గొన్నారు.

## దృష్టి సమస్యలపై యువత దృష్టి సారించాలి

వాల్మీకిపురం, మార్చి 26 ప్రభాతవార్త :




సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

యువతలో ప్రస్తుతం దృష్టి సమస్యలు తరచూ తలెత్తుతున్నాయని, వీటిపై యువత దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైన ఉందని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బాబు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో మదనపల్లె ఇషి కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు, కళాశాల సిబ్బందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. అంతకు మునుపు ఏర్పాటు చేసిన విద్యార్థుల సమావేశంలో ఇషి కంటి ఆసుపత్రి వైద్యులు సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో యువతలో కంటి సమస్యలు వస్తున్నాయని, ఇందులో దృష్టి సమస్యలు ఎక్కువగా ఉత్పన్నమోతున్నాయన్నారు. ఇలాంటి తరుణంలో యువత కంటి పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దృష్టి సమస్యలు పరిష్కరించుకుని కంటిచూపును పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం కంటి సమస్యలున్న విద్యార్థులకు మందులను, కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, అధ్యాపకులు పెద్దప్పరాజు, జ్యోతి, ప్రవీణ్ కుమార్, విజయలక్ష్మి, రేణుక, కృపమై, సుబ్రహ్మణ్యం, జయరామిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## విశ్వం నందు క్లౌడ్ టెక్నాలజీలపై బూట్ క్యాంపు

కురబలకోట మార్చి 26 ప్రభాతవార్త



కురబలకోట మండలం అంగళ్లకు సమీపంలో ఉన్న విశ్వం ఇంజనీరింగ్ కాలేజ్ నందు ఏఐఎంఎల్ మరియు క్లౌడ్ టెక్నాలజీల పై బూట్ క్యాంపును ఐబీ ఎం స్కిల్ బిల్డ్ మరియు ఎడ్యునెట్ ఫౌండేషన్ తో సంయుక్తంగా నిర్వహించింది. విశ్వం ఇంజనీరింగ్ కాలేజీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు మిషన్ లెర్నింగ్ ఏఐఎంఎల్ మరియు క్లౌడ్ టెక్నాలజీల పై రెండు రోజుల బూట్ క్యాంపును నిర్వహించింది. విద్యార్థులకు ఈ ఆధునిక టెక్నాలజీలో ప్రాక్టికల్ శిక్షణ పొందే గొప్ప అవకాశం అందించింది. ఈ బూట్ క్యాంపును శ్రీ నరేంద్ర ఏలూరి నిర్వహించారు. మరియు ఏఐఎంఎల్ మరియు క్లౌడ్ కంప్యూటింగ్ పై ప్రావీణ్యమైన శిక్షణను అందించారు. విద్యార్థులు విలువైన ప్రాక్టికల్ అనుభవం పొందారు. కాలేజ్ చైర్మన్ ఎం ప్రభాకర్‌రెడ్డి విద్యార్థులు ఈ బూట్ క్యాంప్ ద్వారా పొందిన శిక్షణను సద్వినియోగం చేసుకొని నూతన టెక్నాలజీలలో మంచి కెరీర్ సాధించడానికి ప్రయత్నించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆర్ వసంత సెలవ కుమార్ హెచ్ఓడి సిఎస్సి, డాక్టర్ బి హేమశ్రీ హెచ్ఓడి ఏఐడిఎస్, డాక్టర్ ఎం అంజన్ కుమార్ ప్రోగ్రాం కన్వీనర్ మరియు శ్రీ పి విశ్వనాథ రెడ్డి గారు ప్రోగ్రాం కోఆర్డినేటర్ పాల్గొని ఈ బూట్ క్యాంపును విజయవంతంగా నిర్వహించడానికి కీలక పాత్ర పోషించారు.

## డూప్ యార్న్ సిల్క్ గుర్తింపునిచ్చి ఖ్యాతిని పెంచాలి

ప్రొద్దుటూరు అర్బన్, మార్చి 26 ప్రభాతవార్త:

కమిషనర్ చేనేత మరియు జౌళి శాఖ ఆదేశాల ప్రకారం కడప జిల్లాలో చేనేత మరియు జౌళి శాఖకు సంబంధించి ప్రొద్దుటూరు లోని డూప్ యార్న్ సిల్క్ మరియు మాధవరం లోని మాధవరం కాటన్ చీరలు భౌగోళిక గుర్తింపు ఎంపిక ప్రక్రియకు సంబంధించి హైదరాబాదులోని రెజల్యూషన్ వారు బుధవారం ప్రొద్దుటూరులోని శ్రీ చెన్నకేశవ సిల్క్ చేనేత సహకార సంఘాన్ని సందర్శించి డూప్ యార్న్ సిల్క్ యొక్క తయారీ విధానాన్ని దాని యొక్క ప్రత్యేకతను తెలుసుకోవడం జరిగినది. అలాగే డూప్ యార్న్ సిల్క్ యొక్క రీలింగ్ యూనిట్, డైయింగ్ యూనిట్ మరియు చేనేత మగ్గాలు సందర్శించి డూప్ యార్న్ సిల్క్ యొక్క తయారీని ప్రత్యక్షంగా పరిశీలించడం జరిగినది. ఈ భౌగోళిక గుర్తింపు మన పొద్దుటూరులోని డూప్ యార్న్ సిల్క్ కి వస్తే మన ప్రొద్దుటూరు ప్రపంచ గుర్తింపు పొందిన నగరంగా అభివృద్ధి చెంది చేనేత కార్మికులకు ఉపాధి పరంగా ఆర్థికంగా ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత, జోళీ శాఖ అధికారులు అహ్మద్ మోహిద్దీన్, సివి శేషగిరి, ఎన్ రవి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు.



## సిండికేట్తో పంచాయితీ ఆదాయాన్ని గండి

పీలేరు మార్చి 26 ప్రభాతవార్త :



పీలేరు మేజర్ పంచాయతీ పరిధిలోని వ్యాపార సముదాయాలు, వారపు సంత, దినసరి కూర కాయల మార్కెట్, జంతువుల శాల తదితరాలకు ఏటా వేలంపాటలు నిర్వహిస్తారు. ఈ వేలం పాటల్లో పంచాయతీకి వచ్చే ఆదాయంతో అభివృద్ధి పనుల కు ఈ నిధులను ఖర్చు చేస్తూ వస్తున్నారు. ఇది ఇలా ఉంటే పీలేరు వారపు సంత వేలం పాటల్లో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. 2019 నుంచి వేలం పాటల్లో వచ్చే ఆదాయం క్రమక్రమంగా తగ్గిపోతూ వస్తుంది. ఈ క్రమంలో పదేళ్లుగా పీలేరు వారపు సంతను దక్కించుకుంటూ వచ్చిన ఒక వ్యాపారి వ్యాపారులందరినీ సిండికేట్ చేసి పంచాయతీకి ఆదాయం రాకుండా చేశారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 2019లో ఇదే వ్యక్తి 30 లక్షల కు వారపు సంతను వేలంపాటలు దక్కించుకున్నాడు. ప్రతి ఏటా ఈ వేలం పాటలు ద్వారా వచ్చే ఆదాయానికి గండిపడుతూ వస్తోంది ఈ వేలం పాటలను పారదర్శకంగా నిర్వహించాలని పంచాయతీకి ఆదాయాన్ని పెంచాలని పలువురు ప్రజా సంఘ నాయకులు పంచాయతీ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ వేలం పాటలు పారదర్శకంగానే నిర్వహించి పంచాయతీ ఆదాయం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని ఈవో గురు మోహన్ తెలిపారు .

## గారాల మడుగులో నేడే రీ సర్వే గ్రామ సభ

పుల్లంపేట, మార్చి 26( ప్రభాతవార్త)

మండలం గారాలమడుగు రెవెన్యూ గ్రామంలో నేడు రి సర్వే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని పుల్లంపేట మండల తాసిల్దార్ ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. నేటి ఉదయం 10 గంటలకు గారాల మడుగు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ గ్రామసభ నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ రీ సర్వేలో ఈ గ్రామ రైతులందరూ పాల్గొని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని, సంబంధిత అధికారులకు సహకరించాలని మీ భూములను కొలతలు వేయించుకోవాలని ఆయన రైతులను కోరారు. అల్లంపేట మండలంలో గారాల మడుగు రెవెన్యూ గ్రామర్ తో పాటు పుత్తని వారి పల్లె రెవెన్యూ గ్రామం కూడా రీ సర్వే కార్యక్రమానికి ఎంపిక కాబడిందని ఆయన ఈ సందర్భంగా అందులో పేర్కొన్నారు. రేపు శుక్రవారం కొత్త పుత్తనవారిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో రి సర్వే గ్రామసభను నిర్వహించడం జరుగుతుందని కూడా ఆయన ఈ సందర్భంగా వివరించారు. ఆ గ్రామ ప్రజలు కూడా అందరూ గ్రామ సభకు హాజరై వారి సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

## టెన్త్ క్లాస్ పరీక్షా పత్రాల లీకేజ్ ముద్దాయిల అరెస్టు



ఎడ్యుకేషన్ మార్చి 26 ప్రభాతవార్త

పదవ తరగతి పరీక్ష పత్రాల లీకేజ్ చేసిన ముద్దాయిలును బుధవారం నాడు పోలీసులు అరెస్ట్ చేశారు 24 వ తేది వల్లూరు జడ్పీ హైస్కూల్ సెంటర్ నందు శీలీది పబ్లిక్ ఎగ్జామ్ మ్యాథమెటిక్స్ క్యూస్షన్ పేపర్ ను కొన్ని ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు కలిసి లీకేజ్ కు పాల్పడ్డట్టు పోలీసులు నిర్ధారణ చేశారు పోలీసుల కథనం మేరకు కమలాపురం టౌన్ నందు ఒక ప్రైవేటు స్కూల్ ను నడుపుతున్న స్కూల్ యాజమాన్యం తమ స్కూల్ లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులను 100 ఉత్తీర్ణత సాదించేలా చేసి, IIIT నందు వారికి సీట్లు వచ్చే విధంగా పరీక్ష లలో మార్కులు సాధిస్తే తమ స్కూల్ కు మంచి పేరు, పబ్లిసిటీ వచ్చి అడ్మిషన్ లు పెరుగుతాయనే దురుద్దేశ్యంతో వల్లూరు మండలములోని zp high school లో జరుగుతున్న ssc maths question paper పరీక్షకు వచ్చే టీచర్లను మరియు చీప్ ఇన్విజిలేటర్, వాటర్ బాయ్ సాయి మహేష్, శ్రీకాంత్ రెడ్డి, మధు యాదవ్, శ్రావణి, విఘ్నేష్ లతో కుట్ర పన్ని, సాయి సెల్ ఫోన్ ద్వారా, క్వెషన్ పేపర్ ను ఫోటో తీయించి, షేర్ చేయించుకుని, వాటిని లీక్ చేసి వాటికి ఆన్సర్ చిట్టిల ను, శ్రీకాంత్ రెడ్డితో తయారు చేయించి, తమ విద్యార్థులకు వాటిని చేర్చిన ట్టుగా తెలిపారు అయితే పై విదంగా Whats App ల ద్వారా సర్క్యులేట్ కాబడిన question paper కడప జిల్లా దీనివీ దృష్టికి రావడంతో ఆయన ఇచ్చిన పిర్యాదు మేరకు వల్లూరు పోలీసు స్టేషన్ లో కేసు నమోదు చేసి కేసును చేదించడం జరిగిందని తెలిపారు.

## వారపు సంత వేలం ద్వారా పెరిగిన ఆదాయం

తంబళ్లపల్లె మార్చి 26 ప్రభాతవార్త ః



తంబళ్లపల్లె మండలం కోసువారి పల్లి పంచాయతీ వారపు సంత వేలం పాటలు ద్వారా పంచాయతీ ఆదాయం పెరిగినట్లు సర్పంచ్ విజయలక్ష్మి, కార్యదర్శి శ్రీనివాస రావులు తెలిపారు. బుధవారం సచివాలయంలో కోసువారిపల్లె వారపు సంత వేలం పాటలు నిర్వహించారు. ఈ వేలం పాటలలో వారపు సంత గేటు వసూలు పై రూ 90 వేలు కాసింసాబ్ దక్కించుకున్నాడు. బయమ్మచెరువు చేపల చెరువు వేలంపాట అనివార్య కారణాల వల్ల వాయిదా వేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ వేలం పాటల ద్వారా సమకూరిన నిధులతో గ్రామంలో వీధిలైట్లు, పారిశుధ్యం, తాగునీరు, మౌలిక సదుపాయాలు కల్పనకు ఖర్చు చేయనున్నట్లు విలేకరులకు తెలిపారు. ఈ వేలం పాటలలో మాజీ సర్పంచ్ బేరి శ్రీనివాసులు, రఘునాథ్, శంకర్ రెడ్డి. బయమ్మచెరువు చైర్మన్ ఆదిరెడ్డి, కోళ్ల ఫారం శ్రీనివాస్ రెడ్డి, జయరామిరెడ్డి,గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

## గ్రామ సందర్శనలో పాల్గొన్న ఎంపీడీవో

ముద్దనూరు, మార్చి 26, ప్రభాతవార్త:



మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామం లో బుధవారం నాడు మండల అభివృద్ధి అధికారి ముకుందా రెడ్డి గ్రామ సందర్శన కార్యక్రమం చేపట్టారు. ఉపాధి హామీ కూలీలు చేపడుతున్న పని ప్రదేశాన్ని పరిశీలించి న అనంతరం గ్రామంలోని ఎస్ డబ్ల్యూ పిసి, పాఠశాలను, అంగన్వాడి పాఠశాల, గ్రామ సచివాలయాన్ని పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మోహన్ రాజా, సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

## నాటుసారా స్థావరంపై దాడులు

మదనపల్లిక్రైమ్, మార్చి 26 ప్రభాతవార్త.



సిటిఎం హరిజనవాడలో నాటుసారా స్థావరంపై ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి, 30 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో యర్రబల్లి హరీష్ (27)ను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. ఇదే కేసులో నాటుసారా సరఫరా చేసిన వాయల్పాడు మండలం దిగువ మేకల వారిపల్లికి చెందిన ఎం. మల్లికార్జున (27) పరారీలో ఉన్నాడు. ఎక్సైజ్ సీఐ భీమలింగ మాట్లాడుతూ నాటుసారా తయారీ, విక్రయాలపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. ప్రజల సహకారంతో ఈ అక్రమ కార్యకలాపాలను అరికట్టడానికి చర్యలు చేపట్టినట్టు తెలిపారు. దాడిలో ప్రొహిబిషన్ అండ్ఎక్సైజ్ సబ్ఇన్స్పెక్టర్లు డార్కస్, జబీవుల్లా, హెడ్‌కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, వీరనాగయ్య, కానిస్టేబుళ్లు నాగరాజు,మధు, శివరాణి పాల్గొన్నారు.

## దేవాలయ భూమి పూజ కార్యక్రమానికి ఆహ్వానం

పోరుమామిళ్ల రూరల్, మార్చి 26 ప్రభాతవార్త:



పోరుమామిళ్ల పట్టణానికి సమీపంలోని బండి నరవ ప్రాంతంలో కడప జిల్లాలోని ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన దేవాలయ సముదాయ నిర్మాణం లో భాగంగా ఏప్రిల్ 13వ తేదీన జరగబోవు శ్రీ నందీశ్వర స్వామి దేవాలయం (108శివలింగముల) భూమి పూజ కార్యక్రమానికి బద్వేల్ తాలూకా మాజీ శాసనసభ్యులు శ్రీ కొనిజేటి విజయమ్మ, బద్వేల్ తాలూకా తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ రితేష్ రెడ్డిలను దేవాలయ కమిటీ సభ్యులు సాదరంగా భూమి పూజ కార్యక్రమానికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని ఆహ్వానించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బండి నరవ దేవాలయ కమిటీ ప్రధాన కార్యదర్శి నూనె శ్రీనివాసులు , కమిటీ సభ్యులు వాకాచంద్రశేఖర్ వడ్డమాను రాజారెడ్డి ద్దిరెడ్డి వెంకటరెడ్డి, రమణారెడ్డి, ఫణీరావు స్వామి కలవకూరి రమేష్, కల్లూరు రామ్ భూపాల్ రెడ్డి, బీరం రామకృష్ణారెడ్డి ,రాంభూపాల్ రెడ్డి, ,వెంకట్రామిరెడ్డి, చెన్నం శెట్టి సుబ్బరాయుడు, కశ్యం శ్రీనివాసులు పాల్గొన్నారు.

## జ్యోతి క్షేత్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే ఆది

పోరుమామిళ్ల రూరల్, మార్చి 26ప్రభాతవార్త:



కాశి నాయన జ్యోతి క్షేత్రాన్ని బుధవారం బిజెపి ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, బద్వేల్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి జ్యోతి క్షేత్రానికి అనుమతులు వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు. గత ఐదు సంవత్సరాల వైసిపి ప్రభుత్వంలో ఎంపీగా ఉన్న అవినాష్ రెడ్డి గతంలో ఎంపీ ఉన్న జగన్మోహన్ రెడ్డి జ్యోతి క్షేత్రానికి ఏమి చేశారు. పార్లమెంటులో మాట్లాడిన వైసీపీ ఎంపీ మేడా రఘునాథరెడ్డి దొంగ మాటలు మాట్లాడాడని ఎద్దేవా చేశారు. కాశీనాయన జ్యోతి క్షేత్రానికి 13 ఎకరాలు అనుమతులు తీసుకొని సకల సౌకర్యాలు సమకూరుస్తామని తెలిపారు. కాశి నాయన మండల వాసి వైసీపీ ఎమ్మెల్సీ గోవిందరెడ్డి జ్యోతి క్షేత్రానికి ఏమి చేశారని ప్రశ్నించారు.

## మైనార్టీ అభ్యర్థులకు సబ్సిడీతో రుణాలు

### మైనార్టీస్ కార్పొరేషన్ ఈడీ వి.బ్రహ్మయ్య వెల్లడి

రాజంపేట అర్బన్, మార్చి 26 ప్రభాతవార్త

ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం ద్వారా మైనార్టీలకు సబ్సిడీతో రుణాలు అందజేసేందుకు దరఖాస్తులు పంపాలని జిల్లా మైనార్టీస్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ వి . బ్రహ్మయ్య ఒక ప్రకటనలో కోరారు. తయారీ రంగంలో ,సేవారంగంలో యూనిట్లు మంజూరు చేస్తామన్నారు. తయారీ రంగంలో 50 లక్షలు, సేవారంగంలో 20 లక్షలు రుణం అందజేస్తామన్నారు. ఏ యూనిటైనా కొత్తదై ఉండాలన్నారు. పాత యూనిట్ దారులుదరఖాస్తుకు అనర్హులని స్పష్టం చేశారు. యూనిట్ విలువలో సబ్సిడీ 15 శాతం నుంచి 35 శాతం వరకు ఉంటుందన్నారు. లబ్ధిదారులు వాట తప్పనిసరిగా 10 శాతం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఐదు లక్షలు రుణం విలువ దాటితే అభ్యర్థులు కనీసం ఎనిమిదో తరగతి పాస్ అయి ఉండాలన్నారు. ఈ పథకం కింద ముస్లింలు, జైనులు, సిక్కులు, పారాసికులు, బౌద్ధ మతస్తులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు అన్నారు. అభ్యర్థులు దరఖాస్తుతో పాటు ఫోటో, ప్రాజెక్ట్ రిపోర్టు ,కుల ధ్రువీకరణ పత్రము అవసరమైన ఇతర సర్టిఫికెట్లతో తమ వెబ్సైట్లో మాత్రమే దరఖాస్తులు నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 08562 241137, 98499 01140 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

## జడ్పీటీసీ రవికుమార్ రెడ్డికి మాతృ వియోగం

వేంపల్లి, మార్చి 26, ప్రభాతవార్త :



వేంపల్లి జడ్పీటీసీ సభ్యులు ఎం. రవి కుమార్ రెడ్డికి మాతృవియోగం కలిగింది. గత కొద్ది రోజులుగా తీవ్ర అస్వస్థతో బాధపడుతున్న తల్లి మాచిరెడ్డి లక్ష్మీనరసమ్మ (84) బుధవారం కడప లోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో కన్నుమూశారు. లక్ష్మీ నరసమ్మ పార్థివ దేహాన్ని స్వగృహమైన వేంపల్లి మండలం గిడ్డంగివారిపల్లె గ్రామానికి తరలించారు. అనంతరం కుమారులు మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, జగన్ మోహన్ రెడ్డి, రవికుమార్ రెడ్డి, కుమార్తెలు కళావతి, హరిప్రియలు స్వగృహానికి చేరుకుని కంటతడి పెట్టారు. అనంతరం కందుల ఇంజనీరింగ్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూట్ అధినేత చంద్ర ఓబుల్ రెడ్డి (నాని), కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి, వైఎస్ఆర్సీపీ మండల కన్వీనర్ చంద్ర ఓబుల్ రెడ్డి, సర్పంచి ఆర్.శ్రీనివాసులు, మునేష్, దస్తగిరి, వైఎస్ఆర్ సీపీ నాయకులు సింగారెడ్డి రామచంద్రారెడ్డి, గరిషా వెంకట రెడ్డి, వెంకట నారాయణ రెడ్డి, ప్రదీప్ కుమార్ రెడ్డి తదితరులు నివాళులర్పించారు. అలాగే కుటుంబ సభ్యులను ఓదార్చారు.

## ముస్లింలకు ఇఫ్తార్ విందు

పులివెందుల రూరల్, మార్చి 26, ప్రభాతవార్త :



పులివెందుల పట్టణ పరిధిలోని శ్రీరామ థియేటర్ వద్ద ఉన్న పాత ఈద్గా ఆతిక్ మసీద్ లో బుధవారం జిల్లా వైసీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ నూరుల్లాహ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి నూరుల్లాహ్ ఆహ్వానం మేరకు ముఖ్య అతిథులుగా మున్సిపల్ ఇంచార్జి వైయస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పులివెందుల పట్టణ వైకాపా కన్వీనర్ హాల్ గంగాధర్ రెడ్డి కౌన్సిలర్లు పార్నపల్లి కిషోర్ తదితరులు హాజరయ్యారు. ఉపవాసం విడిచే సమయంలో పండ్లు, ఫలహారాలతో మసీదులో మత పెద్దల ఆధ్వర్యంలో నమాజ్ పాటించి పార్లమెంట్ సభ్యులు వైయస్ అవినాష్ రెడ్డి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం నూరుల్లాహ్ ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందు భోజన కార్యక్రమాలలో ముఖ్య అతిథులు ముస్లిం సోదరులు పాల్గొన్నారు. అనంతరం వైయస్ మనోహర్ రెడ్డి తరుపున ప్రతి ఒక్క ముస్లిం సోదరులకు సోదరీమణులకు ముందస్తు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆతిక్ మసీద్ కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు ముత్తవలీలు వైఎస్ఆర్ సీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర పంచాంగము వితరణ

మైదుకూరు, మార్చి 26, ప్రభాతవార్త:



శ్రీశ్రీశ్రీ ఓంకార స్వామి సమరసత సేవా ఫౌండేషన్ అర్చకులు అందరికీ తిరుమల తిరుపతి దేవస్థానం ఉగాది నూతన సంవత్సర పంచాంగము వితరణ చేయడం జరిగింది ఇంకా అర్చకులు కావలసినవారు సంప్రదించగలరని తెలిపారు. అనంతరం సుంకేసుల దేవాలయ కమిటీ సభ్యులు నూతన ధ్వజ స్తంభము గోపురం మీద విగ్రహాలు మే నెల ప్రతిష్ట కోసం శ్రీ శ్రీ శ్రీ ఓంకార్ స్వామివారిని ఆహ్వానించడం జరిగింది.

## మార్చి 28న హుండీ లెక్కింపు

సిద్దవటం, మార్చి 26, ప్రభాతవార్త:

మండలంలోని వంతాటిపల్లె గ్రామం లంకమల్ల అడవుల్లో వెలసిన శ్రీనిత్యపూజేశ్వర ఆలయ హుండీ లెక్కింపు మార్చి 28 శుక్రవారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఆలయ ఈవో శ్రీధర్ అన్నారు. భక్తులు హుండీ లెక్కింపు పరకామణిలో పాల్గొనాలని తెలిపారు.

## త్వరలో రీ సర్వే ప్రారంభం

కలికిరి, మార్చి 26, ప్రభాతవార్త:

మర్రికుంటపల్లె పంచాయతీలో త్వరలో భూములకు సంబంధించి రీ సర్వే ప్రారంభం కానున్నట్లు మర్రికుంటపల్లె పంచాయతీ వీఆర్వో సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రైతులు తమ భూములకు సంబంధించిన పాస్ పుస్తకం జిరాక్సులు, వన్-బి, ఆధార్, 2 పాస్‌పోర్టు సైజు ఫొటోలు, బ్యాంకు ఖాతా పుస్తకం తదితర జిరాక్సులు అలాగే ఫోన్ నెంబరును సంబంధిత వీఆర్వో, వీఆర్ఏలకు అందజేయాలన్నారు. ఎవరికైనా రైతులకు సంబంధించిన పాసుపుస్తకాలలో రైతుకు సంబంధించిన భూమి ఆన్‌లైన్‌లో నమోదు కాకుండా ఉంటే ఆ భూములకు సంబందించిన పత్రాల జిరాక్సులు సిద్ధంగా ఉంచుకోవాలని వీఆర్వో సూచించారు. రైతులకు సంబంధించిన భూముల్లో ముళ్ల కంపలు ఉన్నా వాటిని తొలగించాలన్నారు. రీ సర్వేకి వచ్చే అధికారులకు రైతులు, ప్రజలు, ప్రజా ప్రతినిధులు సహకరించి తమకు చెందిన భూములు సక్రమంగా ఉండేలా సరిచూసుకోవాలని ప్రభుత్వం కల్పిస్తున్న ఈ రీసర్వే అవకాశాలను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఉపాధి హామీ పథకం పనులు వేగవంతం చేయాలి

కలికిరి, మార్చి 26, ప్రభాతవార్త:

మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో భానుమూర్తిరావు ఏపీవో మంజుల పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ పథకం పనులపై ఎంపీడీవో ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గతంలో ఏపీవోగా పనిచేసిన సుజాత కలకడకు బదిలీ కావడం, బి.కొత్తకోటలో ఏపీవోగా పనిచేస్తున్న మంజుల కలికిరి ఏపీవోగా బాధ్యతలు చేపట్టడం జరిగిందన్నారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన మంజులకు ఉపాధి సిబ్బంది సహకరించి పనులు వేగవంతంగా జరిగేందుకు ఉపాధి సిబ్బంది ప్రత్యేక చొరవ చూపాలన్నారు. గ్రామాల్లో కూలీల సంఖ్య పెంచాలని పనులు జరిగే చోట కూలీలకు ప్రత్యేక సౌకర్యాలు, మంచినీటి సౌకర్యాలు కల్పించాలని కూలీలు వడదెబ్బకు గురి కాకుండా ఉపాధి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మంజుల, టెక్నికల్ అసిస్టెంట్ పద్మావతమ్మ, రెడ్డిబాషా, రవికుమార్, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## యోగా తరగతుల పోస్టర్ ఆవిష్కరణ

పీలేరు మార్చి 26 ప్రభాతవార్త :



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

స్థానిక ఆర్టీవో ఆఫీస్ నందు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీమతి విజయ కుమారి షీ దివ్య యోగ విద్యాలయం వారి సమ్మర్ యోగా క్యాంప్ మరియు రెగ్యులర్ యోగ క్లాసెస్ కు సంబంధించిన గోడపత్రికలు మరియు కరపత్రములు విడుదల చేయడం జరిగినది. ఈ కార్యక్రమమునందు షీ దివ్య యోగ విద్యాలయ అధ్యక్షురాలు డాక్టర్ పీవీఎస్ లక్ష్మి మరియు న్యాయ సలహాదారులు డాక్టర్ రాయల సుధాకర్ రాయలు పాల్గొన్నారు.

## నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా

మైదుకూరు, మార్చి 26, ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీ ఎస్ఎస్ డిసి), సీడప్ మరియు ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ వారి ఆధ్వర్యంలో మార్చ్ 28 వ తేదీన స్థానిక గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించబడుచున్నదని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. నారాయణ రెడ్డి తెలియజేశారు. ఈ జాబ్ మేళాకు ఏయు స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, ఛానల్ ప్లే లిమిటెడ్,పేటీఎం వంటి ప్రముఖ 3 కంపెనీలు విచ్చేస్తున్నాయి. ఈ జాబ్ మేళాలో 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, డిప్లొమా అభ్యర్థులు పాల్గొనవచ్చును. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు సంబంధిత సర్టిఫికెట్లు, బయోడేటా, ఆధార్, పాస్పోర్ట్ సైజు ఫోటోతో హాజరుకావలెను. ఇంటర్వ్యూ ప్రాతిపదికన ఎంపిక చేయబడును. ఆకర్షణీయమైన వేతనము కలదు. మైదుకూరు, బద్వేల్ మరియు పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువతీ యువకులు ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. మరిన్ని వివరాలకు ఏపి.యస్ఎస్.డి.సి కోఆర్డినేటర్ జి.శివ క్రిష్ణ (9398348760)ను సంప్రదించండి.

## ఎర్రచందనం అక్రమరవాణాపై కళాజాత



కాశినాయన, మార్చి 26, ప్రభాత వార్త

ఎర్రచందనం అక్రమ రవాణా గురించి తెలిసినవారు అటవీశాఖ వారికి సమాచారం ఇవ్వాలని కడప జిల్లా అటవీ శాఖ అధికారి వినీత్ కుమార్ తెలిపారు. బుధవారం ప్రొద్దుటూరు సబ్ డివిజన్ అటవీ అధికారి దివాకర్ ఆదేశాల మేరకు పోరుమామిళ్ల రేంజ్ ఆఫీసర్ రఘునాథ రెడ్డి ఆధ్వర్యంలో మల్లేపల్లి సెక్షన్ పరిధిలోని మల్లేపల్లి జెడ్పిహెచ్ స్కూల్ నందు ఎర్రచందనం అక్రమ రవాణా, వణ్య ప్రాణుల వెటాడడం మరియు అడవికి నిప్పు పెట్టడం వలన కలిగే నష్టాలు కఠినమైన అటవీ చట్టాల గురించి మైదుకూరు " శ్రీ వీరభద్ర కళాజాత" వారిచే విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎర్రచందనం అక్రమ రవాణా వలన కలిగే నష్టాల గురించి విద్యార్థులు ఇంటి వద్ద పెద్దలకు చెప్పవలెను అని సూచించారు. ఈ కార్యక్రమం లో మల్లేపల్లి స్కూల్ ఉపాధ్యాయ బృందం తో పాటు అటవీ సెక్షన్ ఆఫీసర్ రమణ, బీట్ ఆఫీసర్లు నారాయణ స్వామి, క్రిష్ణయ్య, కరుణాకర్, భారతి,వీరప్రతాప్ పాల్గొన్నారు.

## మామిడితోటల సస్యరక్షణపై రైతులకు అవగాహన

రైల్వే కోడూరు మార్చి 26 ప్రభాత వార్త

మండలంలో మామిడి తోటల సస్యరక్షణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని అనంతరాజుపేట ఉద్యాన కళాశాల లో నిర్వహించారు. ఈ సందర్భంగా కీటక విభాగం శాస్త్రవేత్త డాక్టర్ శారద మామిడి రైతులకు ఒక అవగాహనను నిర్వహించారు. పెనగలూరు, కొండూరు, ఈట్ మార్పురం, సిద్దవరం రైతు సేవా కేంద్రాలలో మరియు కోడూరు మండలంలోని సెట్టిగుంట, సీయవరం, మారేవారిపల్లె రైతు సేవా కేంద్రాలలో క్షేత్రస్థాయిలో పరిశీలించిన రైతులకు పురుగులు తెగుళ్ల సస్యరక్షణ పై అవగాహన కల్పించామన్నారు, మామిడిలో నల్ల తామర పురుగులు తేనెమంచు పురుగు ఉధృతి ఉన్నట్టు గమనించడం జరిగిందని డాక్టర్ శారద తెలిపారు. ప్రతిమామిడి రైతు తామర పురుగుల నివారణకు నీలి రంగు జిగురు అట్టలను ప్రతి చెట్టుకు అమర్చుకోవాల్సిందిగా రైతులకు సూచించారు. అలాగే తామర పురుగుల నివారణకు ప్రిప్రో నిల్ రెండు లీటర్లు స్పైన్ షాడ్ 4 మిల్లీ లీటర్లు నీటిని కలిపి పిచికారి చేసుకోవాలని అన్నారు. తోటలలో పూత పింది రాలుటను నివారించుటకు ప్లానోఫిక్స్ 0.25 మిల్లీలీటర్లు నీటిని కలిపి పిచికారి చేయాలని తెలిపారు. ప్రతి పిచికారీలో స్టిక్కింగ్ ఏజెంట్ తప్పనిసరిగా వాడాల్సిందిగా రైతులకు తెలిపారు. పూ మొగ్గ దశలో తేనె మంచు పురుగు పక్షి కన్ను తెగులు మరియు బూడిద తెగులు ఆశించే అవకాశం అధికంగా ఉన్నందున మొదటి పిచికారి మోనోక్రోటోఫాస్ కలపాలన్నారు. తెల్ల పూత దశలో ఉన్నప్పుడు ఎటువంటి మందులు పిచికారి చేయకూడదని తెలిపారు. నల్లపూస దశలో తేనె మంచు పురుగు తామర పురుగులు మరియు ఆంత్ర క్రోస్ తెగులు నివారణకు బుప్రోజిన్ తదితర మందులను లీటర్ అన్నిటికి కలిపి పిచికారి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఉద్యాన అధికారి జి సురేష్ బాబు, రైల్వే కోడూరు ఉద్యాన శాఖ అధికారులు వెంకట భాస్కర్, సేవా కేంద్ర సిబ్బంది మరియు మామిడి రైతులు పాల్గొన్నారు.



# సేంద్రీయ ఎరువులు వాడకంపై రైతులకు అవగాహన సదస్సు

**వైయస్సార్ కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి డాక్టర్ యం.బాలక్రిష్ణ**




**మైదుకూరు, మార్చి 26, ప్రభాతవార్త:**
వైయస్సార్ కృషి విజ్ఞాన కేంద్రం వనిపెంట నందు ఫెర్మెంటెడ్ సేంద్రీయ ఎరువుల వాడకం పైన అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో కెవికె అధిపతి యం.బాలక్రిష్ణ, సేంద్రియ ఎరువుల వాడకం, వీటి ప్రాధాన్యత మరియు భూమిలో కర్బన శాతం పెంచే విధి విధానాల గురించి సవివరంగా రైతులకు వివరించారు. ఇందులో భాగంగా కెవికె నందు ఫెర్మెంటెడ్ ఆర్గానిక్ మెన్యూర్స్ మీద ప్రాజెక్ట్ వచ్చిందని దానిని ఈ ఖరీఫ్ నుండి అమలు చేస్తున్నామని తెలియజేశారు. దీని కొరకు రైతులకు ఫెర్మెంటెడ్ సేంద్రీయ ఎరువులను మరియు రసాయనిక ఎరువులను ఉచితంగా ఇచ్చి వాటి ద్వారా కొర్ర మరియు మినుము పంటలను పండించాలన్నారు. రసాయనిక ఎరువులు మరియు సేంద్రీయ ఎరువుల వాడకం వలన భూమిలో వచ్చే మార్పులను, పంట దిగుబడులను వచ్చే రెండు కాలాల్లో ( ఖరీఫ్, రబి) పరిశీలించి రైతులకు దీని ఫలితాలను వివరిస్తామన్నారు. ఈ సదస్సులో ఏ పి సి ఎన్ ఎఫ్, నుండి భరత్ కుమార్ విచ్చేసి పకృతి వ్యవసాయ పద్ధతులు, దాని అవసరాల గురించి క్లుప్తంగా వివరించారు. ఎన్ హెచ్ ఆర్ డి ఎఫ్, కర్నూల్ నుండి యం. శ్రావణ్ విచ్చేసి వివిధ పంట రకాల విత్తనాల గురించి వివరించారు. కెవికె శాస్త్రవేత్తలు డాక్టర్ ఎన్ శ్రీ విద్యా రాణి, డాక్టర్ బి ఎస్ కాంతి శ్రీ, మరియు డాక్టర్ ఎస్ ఫిరోజ్ హుస్సేన్, ఈ ప్రాజెక్టుకు సంబంధించిన విషయాలను, సమగ్ర పోషణ యాజమాన్యం గురించి వివరించారు. ఈ సదస్సులో వివిధ గ్రామాల నుండి సుమారు 80 మంది రైతులు పాల్గొని విజయవంతం చేశారు.

## వైభవంగా పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలు


సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ ఈవో వరలక్ష్మి

**వాల్మీకిపురం, మార్చి 26 ప్రభాతవార్త :**
తితిదే ఆధ్వర్యంలోని పట్టాభిరామాలయ వార్షిక బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తితిదే డిప్యూటీ ఈవో వరలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక పట్టాభిరామాలయంలో 2025 వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణపై స్థానికులు, ప్రజాప్రతినిధులతో డిప్యూటీ ఈవో సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా తెదేపా సీనియర్ నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ కంభం నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ గతంలో వలే బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు తితిదే చర్యలు తీసుకోవాలన్నారు ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడే విధంగా వాల్మీకిక్షేత్రంలోని నాలుగుమాడ వీధుల్లో ఏర్పాట్లు ఉండే విధంగా చూడాలని ఇప్పటికే ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో తితిదేకు విన్నవించామన్నారు. ఇందుకు స్పందించిన డిప్యూటీ ఈవో మాట్లాడుతూ శ్రీరాముడి బ్రహ్మోత్సవాలు గతంలో వలే నిర్వహించేందుకు తితిదే సిద్ధంగా ఉందని, బ్రహ్మోత్సవాలలో బాణా సంచా, డీజేలను తితిదే నిషేదించిందన్నారు భక్తులందరూ ఈ విషయానికి సహకరించాలని, స్వామివారి వాహన సేవలన్నీ ఆధ్యాత్మికశోభతో పాటు భక్తిభావం ఉట్టిపడే విధంగా ఉత్సవాలు ఉంటాయన్నారు సీతారాముల కల్యాణాన్ని ఎస్వీబీసీ ఛానల్లో కల్యాణోత్సవం ప్రత్యక్ష ప్రసారాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు మల్లికార్జునరెడ్డి, నల్లిగట్ల వెంకట్రమణ, కోసూరి చంద్రమౌళి, శేషురెడ్డి, కోసూరి రమేష్, పీవీ, ఆనంద్, మురళి, ఉప సర్పంచి కేశవరెడ్డి, శ్రీధర్ రాయల్, రామకృష్ణారెడ్డి, ఆలయ అర్చకులు కృష్ణప్రసాద్ భట్టార్ స్వామి, సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, ఆలయాధికారి కృష్ణమూర్తి నాగరాజు, పంచాయతీ ఈవో రవీంద్రనాథ్, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కుట్టుమిషన్లతో మహిళలు ఆర్థికంగా రాణించవచ్చు


స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

**మదనపల్లె, మార్చి 26 ప్రభాతవార్త :**
మహిళలు కుట్టుమిషన్లచే శిక్షణ పొందితే ఆర్థికంగా ఎదగవచ్చునని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. మదనపల్లె టౌన్‌హాలులో బుధవారం కుట్టు విషన్లపై మహిళలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చిందన్నారు. ముఖ్యంగా బిసి కార్పోరేషన్ ద్వారా మహిళలకు కుట్టుమిషన్లను ఉచితంగా అందజేస్తుందన్నారు. శిక్షణ పూర్తియిన వెంటనే కుట్టు మిషన్లు అందజేయనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కుట్టుమిషన్లపై శిక్షణ పొంది వృత్తి నైపుణ్యతను పెంపొందించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. వృత్తినైపుణ్యతతో మహిళలు ఇతరులపై ఆధారపడకుండా జీవనాధారం పొందవచ్చునన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీ పథకాలను కూడా మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ తాజ్‌మస్రూన్, మెప్మా మధుసూధన్‌రెడ్డి, టౌన్‌బ్యాంకు ఛైర్మెన్ నాదేళ్ళ విద్యాసాగర్, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## టిడిపిలో కోవర్టులను వదిలిపెట్టం

**కార్యకర్తల సమావేశంలో నాయకులు**

**మదనపల్లె, మార్చి 26 ప్రభాతవార్త :**
నియోకవర్గంలోని తెలుగుదేశం పార్టీలో ఉన్న కోవర్టులను వదిలిపెట్టమని నియోజకవర్గ నాయకులు హెచ్చరించారు. బుధవారం ఎమ్మెల్యే షాజహాన్ బాషా నివాసం వద్ద నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమమే తమ ధ్యేయమన్నారు. పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలాంటి వారు అన్నారు. కార్యకర్తలకోసం తాను ఎల్లవేలలా అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. అనంతరంనియోజకవర్గ నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9నెలలు కావస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, మంత్రి నారాలోకేష్ కార్యకర్తల సంక్షేమం కోసం, ప్రజల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా టిడిపి కార్యకర్తలపై వైసిపి నాయకులు చేస్తున్న దాడులు శోచనీయమన్నారు. నియోజకవర్గంలో కొందరు తెలుగుదేశం పార్టీలో ఉండి కోవర్టులుగా పనిచేస్తున్నారని అలాంటి వారిని వదలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా నాయకత్వంలో నియోజకవర్గంలో అభివృద్దితో పాటు సంక్షేమ పథకాలు తీసుకువచ్చికార్యకర్తలకు అండగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్‌బ్యాంకు ఛైర్మెన్ నాదేళ్ళ విద్యాసాగర్, నాయకులు మోడెం సిద్దప్ప, నీలకంఠ, ఆర్‌జె.వెంకటేష్, మాజీ ఎంపిపి రెడ్డప్పరెడ్డి, మేషా రామక్రిష్ణ, ఉత్తన్న, డ్యాన్స్ రెడ్డప్ప, పోతబోలు సుధాకర్, శ్రీనివాసులునాయుడు, చంద్రశేఖర్‌నాయుడు, సోమశేఖర్‌నాయుడు, జేసిబి వేణు, నాగయ్య, ఆర్ఎస్. షంషీర్, రాటకొండ మధుబాబు, ఎర్రబల్లి వెంకటరమణారెడ్డి, బాలుస్వామి, నాగమణి, విజయమ్మ, హసీనా తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే

## శాన్వి సిబిఎస్ఈ స్కూల్లో విద్యార్థుల నృత్యాలు

**దేశ అభివృద్ధిలో విద్యార్థుల పాత్ర ముఖ్యం**

**అడిషనల్ ఎస్పీ మనోజ్ రామ్నాథ్ హెగ్డే**



**రాజంపేట అర్బన్, మార్చి 26 ప్రభాతవార్త**
దేశ అభివృద్ధిలో విద్యార్థుల పాత్ర ఎంతో ముఖ్యమని రాజంపేట అడిషనల్ ఎస్పీ మనోజ్ రామ్నాథ్ హెగ్డే అన్నారు. బుధవారం బోయనపల్లి లో ఉన్న శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ లో వార్షికోత్సవ వేడుకలు అంబరాన్ని అంటాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న మనోజ్ రామనాథ్ హెగ్డే మాట్లాడుతూ దేశ అభివృద్ధికోసం విద్యార్థులు తమ పాత్ర ఏంటో తెలుసుకోవాలన్నారు. విద్యార్థులను క్రమశిక్షణతో కూడిన విద్య ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని తెలిపారు. పిల్లల నృత్య ప్రదర్శన చూసి ఆనందాన్ని వ్యక్తం చేశారు. చదువుతో పాటు సంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు చాలా ముఖ్యమని అన్నారు. ఇలాంటి వాతావరణాన్ని కల్పించి విద్యార్థులను ప్రోస్తహించడం హర్షదాయకమని స్కూల్ యజమాన్యాన్ని అభినందించారు. చిత్తూరు అడిషనల్ ఎస్పీ (ఏ ఆర్) ఆర్. శివానంద కిషోర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకోవాలి అన్నారు. పట్టుదలతో కష్టపడి చదివి చదువుకున్న విద్యాసంస్థలతో పాటు తల్లి దండ్రుల ఆకాంక్షలు నెరవేర్చాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేస్తారు. ఈ కార్యక్రమంలో శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ అధినేత కొండూరు శరత్ కుమార్ రాజు, సి. ఇ. ఓ శంకర్ రాజు , మానేజింగ్ డైరెక్టర్ కొండూరు భారత్ కుమార్ రాజు, ప్రిన్సిపల్ విజయ నిర్మలా , బి.వి.యన్ ప్రిన్సిపల్ రాము, వైస్ ప్రిన్సిపల్ జయశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రజా దర్బార్‌లో సమస్యల వెల్లువ

**:పరిష్కారానికి కృషిచేస్తామని హామి ఇచ్చిన రితేష్**



**బద్వేలు, మార్చి 26 (ప్రభాతవార్త):**
పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బుదవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా అనేక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీడీపీ యువనేత రితేష్ రెడ్డికి పలువురు వినతి పత్రాలు అందజేశారు. ఈ మేరకు ఆయన సంబంధిత సమస్యలను పరిశీలించి అందుకు తగిన విధంగా అధికారులతో మాట్లాడారు.గత వైసీపీ హయాంలో నియోజకవర్గంలో ఎక్కువగా భూ కుంభకోణాలు వెలుగు చూసిన విషయం విధితమేనని, ఈ మేరకు అలాంటి బాధితులు నియోజకవర్గంలో ఎంతో మంది ఉన్నారని వారికి న్యాయం చేసేందుకు తనవంతు కృషిచేస్తానన్నారు. ఇవే గాక ప్రజలు ఇంకా ఎన్నో సమస్యలతో సతమతమవుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. పార్టీ కార్యాలయంలో ఇక నుంచి ప్రతి బుధవారం ప్రజా దర్బార్ కార్యక్రమం ఉంటుందని నియోజకవర్గవ్యాప్తంగా సమస్యల పరిష్కారానికి కృషిచేయడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని ఆయన తెలిపారు. అనంతరం మధ్యాహ్నం టీడీపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## టౌన్ ప్లానింగ్ నిబంధనలపై అవగాహన

**ఆర్‌డిడిటి విజయ భాస్కర్**

**కడప కార్పొరేషన్ మార్చి 26 ప్రభాతవార్త:**
పుర, నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టే భవన నిర్మాణాలకు ప్రభుత్వం జారీ చేసిన నూతన విధానంపై బుధవారం కడప నగరపాలక సంస్థ కార్యాలయంలో వైయస్సార్ కడప జిల్లా, అన్నమయ్య జిల్లా ఎల్ టి పి, ప్రణాళిక సిబ్బంది తో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ టౌన్ ప్లానింగ్ (డిడిటిపి) విజయ భాస్కర్ మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో నిబంధనలను మరింత సరళీకరిస్తూ రాష్ట్ర పురపాలక శాఖ జీవో నంబర్ 3,4,5,7,20 జారీ చేసిందని తెలిపారు. ఈ నిబంధనల ప్రకారం భవన నిర్మాణాలు చేపట్టేవారు స్వీయ ధ్రువీకరణతో ఎల్టిపిల ద్వారా 24 గంటల్లోపే ప్లాన్ అప్రూవల్ పొందవచ్చు అన్నారు. 300 చదరపు మీటర్ల లోపు భవనాలకు యజమానులే ప్లాన్ ధ్రువీకరించి దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆర్కిటెక్చర్లు, ఇంజినీర్లు, టౌన్ ప్లానర్లు కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. లే అవుట్ కు తప్పకుండా అనుమతులు ఉండాలని పేర్కొన్నారు. ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు సులువుగా అనుమతులు పొందేలా ప్రభుత్వం నిబంధనలను సరళతరం చేసిందని తెలిపారు. సెల్ఫ్ సర్టిఫికేషన్ స్కీం క్రింద భవన నిర్మాణ అనుమతులను అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ జారీ చేస్తూ ఉండేదని, ఇకపై పట్టణ స్థానిక సంస్థలు జారీ చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కడప అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పి ఓ శైలజ, అన్నమయ్య పి ఓ సంధ్య, సిటీ ప్లానర్ రమణ, ఏసీపీలు మునిరత్నం, మునిలక్ష్మి, టౌన్ ప్లానింగ్, వార్డ్ ప్లానింగ్, రెగ్యులర్ సెక్రటరీస్, ఎల్ టి పి ఎస్, బిల్డర్స్ పాల్గొన్నారు.




## విశ్వావసు శుభకరం కావాలి



వాస్తు ,జ్యోతిష పండితులు మాడుగుల శివ శ్రీ శర్మ ఆకాం!! విశ్వావసు నామ సంవత్సర తెలుగు ఉగాది విశ్వానికి సంపద ప్రసాదించి, శుభకరం కావాలని ప్రముఖ వాస్తు, జ్యోతిష పండితులు, అష్టావధాని మాడుగుల శివశ్రీ శర్మ పేర్కొన్నారు. ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో బుధవారం విశ్వావసు ఉగాది ముందస్తు వేడుకలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సాహితీ వేత్త, భారత రాష్ట్రపతి వార్డు గ్రహీత విద్వాన్, డాక్టర్, గానుగపెంట హనుమంతరావు అధ్యక్షత వహించగా, సంఘ ప్రధాన కార్యదర్శి ఎన్ .రామ్మూర్తి నాయుడు పర్యవేక్షించారు. శివశ్రీ శర్మ పంచాంగ ప్రవచనం చేస్తూ, విశ్వావసు నామ సంవత్సరం రేవతి నక్షత్రంతో మొదలవుతుందన్నారు. ఈ సంవత్సరానికి రాదు సూర్యుడు కావడంతో, నాయకుల మధ్య విరోధం తీవ్రంగా ఉండి, అగ్ని బాధలు అధికమవుతాయన్నారు. దొంగల బాధ, రోగాల తీవ్రత కలగటమే కాక నాయకులకు ప్రాణహాని ఉందన్నారు. ఈ సంవత్సరం మంత్రి చంద్రుడు, సేనాధిపతి శని, సస్యాధిపతి బుధుడు, ధాన్యాధిపతి కుజుడు, మేఘాధిపతి సూర్యుడు, రసాధిపతి శుక్రుడు, నీరసాధిపతి బుధుడు అయినందున మిశ్రమ ఫలితాలు ఉండటమే కాక ,యుద్ధభయాలు రాజకీయ ఒడి కలిగే అవకాశం ఉందన్నారు. బ్రహ్మ సృష్టి ప్రారంభించింది ఉగాదినాడే కనుక, ఆరోజు బ్రహ్మను పూజించాలి అన్నారు. గోదిరోజు తప్ప బ్రహ్మకు ఎక్కడ పూజ లేదన్నారు. వసంత రుతువుతో ప్రారంభమయ్యే తెలుగు సంవత్సరంలో చెట్లు చిగురు తొడిగి, ప్రకృతి పూలతో కాయలతో కళకళ లాడుతుందన్నారు. కార్యక్రమం అనంతరం శివ శ్రీ శర్మను సత్కరించారు. కార్యక్రమంలో పెన్షన్స్ ప్రతినిధులు, కార్యవర్గ సభ్యులు సుబ్బరాయుడు రాధాకృష్ణ , పెండ్లిమర్రి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సుగుటూరు గంగమ్మ జాతర..

**రామసముద్రం మార్చి26 ప్రభాతవార్త**



ఉమ్మడి చిత్తూరు జిల్లా పుంగనూరు సుగుటూరు గంగమ్మ జాతరను మంగళ, బుధవారం రెండు రోజులపాటు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామసముద్రం మండలంలోని పలు గ్రామాల ప్రజలు, భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకొన్నారు. రెండు రోజులపాటు పుంగనూరు పట్టణంలోని ఆరుగురు గ్రామ దేవతలకు మహిళలు దీలు, బోనాలు మోసారు. ఉదయం నుంచి, రాత్రి అమ్మవార్లకు పట్టుచీర,సారె, పసుపు, కుంకుమలను సమర్పించారు. అమ్మ వారిని ప్రముఖ రాజకీయ వేత్తలు, మండల టిడిపిపార్టీ అధ్యక్షులు విజయ్ కుమార్ గౌడ్,ఆర్. వి శ్రీనివాస్ గౌడ్ వైసీపీ పార్టీ మండల అధ్యక్షులు కేశవరెడ్డి, వైస్ ఎంపిపి రమణరెడ్డి, మినికి సర్పంచ్ జమున, సుబ్బారెడ్డి,రాష్ట్ర బిసి సెల్ ఉపాధ్యక్షులు గెవన్న మదనపల్లి నియోజకవర్గం బిసి దొడ్డిపల్లె ఆనంద, నందకిషోర్ రెడ్డి నాయకులు నాయకులు అమ్మ వారికి మొక్కులు చెల్లించారు. ఈకార్యక్రమంలో తెలుగు యువత పార్లమెంట్ ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం రాజు, ప్రకాష్, వెంకటముని యాదవ్, సీవి రెడ్డి, పోలీస్ గిరి, జ్యోతి రాజు. వరద రాజు, ఐ టి, కుమార్ తదితరులు పాల్గొన్నారు. గంగమ్మ జాతర సందర్భంగా నియోజకవర్గ టిడిపి యువనేత ఆర్విటి బాబు, సినీ హీరో సప్తగిరి ప్రసాద్ బెంగళూరు నుండి హెలికాప్టర్ లో వచ్చి అమ్మవారికి పూలాభిషేకం చేశారు.

## సైబర్ నేరాలపై కమ్యూనిటీ ఔట్రీచ్




**కురబలకోట మార్చి 26 ప్రభాతవార్త**
మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్ (మిట్స్)లోని కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం (సైబర్ సెక్యూరిటీ) ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా, వాల్మీకిపురంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకులం లో డిజిటల్ మోసం మరియు సైబర్ నేరాలపై అవగాహనపై కమ్యూనిటీ ఔట్రీచ్ కార్యక్రమాన్ని నిర్వహించినారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ మాట్లాడుతూ, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ డిజిటల్ యుగంలో, విద్యార్థులు సంభావ్య ఆన్‌లైన్ బెదిరింపుల గురించి తెలుసుకోవడం మరియు సైబర్ మోసం మరియు నేరాల నుండి తమను తాము ఎలా రక్షించుకోవాలో నేర్చుకోవడం చాలా అవసరమన్నారు. వివిధ ఔట్రీచ్ చొరవల ద్వారా సైబర్ భద్రత గురించి అవగాహన వ్యాప్తి చేయడానికి మిట్స్ కళాశాల నిరంతరం దోహదపడుతుందని, స్కూల్ విద్యార్థులు దశ నుంచే అవగాహన కల్పించేందుకు ఎల్లప్పుడు ముందుటామన్నారు. ఈ కార్యక్రమంలో గురుకులం విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. యువ మనస్సులలో అవగాహన పెంపొందించడానికి మరియు బాధ్యతాయుతమైన డిజిటల్ పౌరసత్వాన్ని ప్రోత్సహించడానికి, సురక్షితమైన మరియు డిజిటల్ అక్షరాస్యత కలిగిన సమాజాన్ని సృష్టించడంలో దోహదపడటానికి మిట్స్ ఎల్లప్పుడు ముందుగా ఉంటుందన్నారు.

## మదనపల్లె జిల్లా ఆస్పత్రి తనిఖీ

**మదనపల్లి క్రైమ్, మార్చి 26 ప్రభాతవార్త**



మదనపల్లె ప్రభుత్వాసుపత్రిని ఎమ్మెల్యే షాజహాన్ బాషా బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రి అత్యవసర విభాగం, ఓపి రిజిస్ట్రేషన్ల కేంద్రం, ఐసీయూలను తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలపై సిబ్బందిని ఆరా తీసి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను, సిబ్బందిని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట షంషీర్, టిడిపి మహిళా నాయకురాలు పులి మహాలక్ష్మి, గాంధీపురం మాజీ కౌన్సిలర్ రాధా, నాగమణి, విజయ తదితరులు ఉన్నారు.

## కూల్చివేతపై మాజీ ముఖ్యమంత్రికి వివరించిన ఎమ్మెల్సీ

**కాశీనాయన, మార్చి 26, ప్రభాత వార్త**
విజయవాడ తాడేపల్లి పార్టీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నీ ఎమ్మెల్సీ డీసీ గోవింద రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ఇటీవల జరిగిన కాశీనాయన ఆలయ నిర్మాణాలను కూల్చివేత ఘటన గురించి జగన్మోహన్‌రెడ్డికు వివరించారు. భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని, ఫారెస్ట్ క్లియరెన్స్ అనుమతులు వచ్చేలాగా కోరుతూ అలాగే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరడం జరిగింది. జగన్ ఆలయ సమస్య తీవ్రతను అర్థం చేసుకొని సానుకూలంగా స్పందించి త్వరలోనే ప్రధానమంత్రి ని మరియు కేంద్ర మంత్రులను త్వరలోనే కలిసి శాశ్వత పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే త్వరలో కాశి నాయన క్షేత్రాన్ని సందర్శించేందుకు నేను కూడా వస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి, మండల కన్వీనర్లో హనుమంతు రెడ్డి, రామకృష్ణారెడ్డి, జిల్లా ఆర్గనైజర్ సెక్రెటరీ రాళ్లపల్లి నరసింహులు, పార్టీ నాయకులు మే రెడ్డి రామ్మోహన్ రెడ్డి, గంటా రమణారెడ్డి, జగన్మోహన్ రెడ్డి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## వృత్తి విద్య కోర్సులతో ఉజ్వల భవిష్యత్తు



**కడప, మార్చి 26 ప్రభాతవార్త :**
విద్యార్థులు చదువుతోపాటు టైపు షార్ట్ హ్యాండ్ వంటి వాటిలో శిక్షణ పొందడం ద్వారా ఉజ్వల భవిష్యత్తును పొందవచ్చునని టైపు రైటింగ్ షార్ట్ హ్యాండ్ ఇన్స్టిట్యూట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈ శ్రీరాములు తెలిపారు బుధవారం చిత్తూరు జిల్లా కేంద్రంలో జరిగిన విద్యార్థుల అభినందన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన ప్రసంగించారు. రాష్ట్రస్థాయిలో కడప విద్యార్థులు ర్యాంకుల పంట పండించారని వారిని ప్రత్యేకంగా అభినందించి జ్ఞాపికలు అందజేశారు. షార్ట్ హ్యాండ్ లో గీత టైపు ఇన్స్టిట్యూట్ విద్యార్థులు రమ్య తేజస్విని, నేత్ర రాష్ట్రస్థాయిలో రెండు మూడు ర్యాంకులు సాధించగా simplex type ఇన్స్టిట్యూట్ విద్యార్థులు ఇంగ్లీష్ హైయర్లో మొదటి రెండవ ర్యాంకులను సొంతం చేసుకున్నారు తెలుగులో సైలేష్ ట్టు ఇన్స్టిట్యూట్ విద్యార్థి మూడో ర్యాంకు సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రశంస పత్రాలు జ్ఞాపకాలు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కడప గౌరవ అధ్యక్షులు సత్యనారాయణ ప్రసాద్ నవీన్, వాసు, ప్రొద్దుటూరు శ్రీనివాస type inst. ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయస్థానంలో చేసే వాక్ ప్రకటనలు అవమానంగా పరిగణించలేము

**(సుప్రీం కోర్టు స్పష్టీకరణ)**

**బద్వేలు లీగల్, మార్చి 26 ప్రభాతవార్త :**
న్యాయస్థానములో చేసిన ప్రకటనలు, ముఖ్యంగా పార్టీలకు ఇబ్బందికరమైన ప్రశ్నలను వేయడం బహిరంగంగా అవమానించడంగా పరిగణించలేమని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. సత్యాన్ని నిర్ధారించుకునేందుకు అనగా నిజాలను రాబట్టేందుకు న్యాయ స్థానానికి ఈ చర్యలు అవసరమని సుస్పష్టం చేసింది. "కోర్టు విచారణ సమయంలో అనేక ప్రకటనలు చేయడం జరుగుతుంది. ఒక వ్యక్తిని అసౌకర్యానికి గురిచేసే ప్రశ్నలు ఎదురవుతాయి, కానీ అలాంటి ప్రకటనలు, లేదా ప్రశ్నలన్నీ ఒక వ్యక్తిని అవమానపరిచేవిగా తప్పుగా అర్థం చేసుకోలేము. కేసులో సత్యాన్ని తెలుసుకోవడం న్యాయ స్థానం యొక్క విధి. విచారణాక్రమంలో కొంత మందికి అసౌకర్యంగా ఉండే కొన్ని ప్రశ్నలు, సూచనలు ముందుకు రావచ్చు." అని న్యాయమూర్తులు సుదాన్షు ధులియా, యహసానుద్దీన్ అమానుల్లాతో కూడిన ధర్మాసనం అభిప్రాయపడింది. రాజస్థాన్ హైకోర్టులో రిట్ విచారణ సమయంలో ఎదురైన ప్రకటనలు, ఇబ్బందికరమైన ప్రశ్నలను సవాల్ చేస్తూ దాఖలైన కేసులో భారత అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలను చేసింది. వాది నెం.1 ఇంటికి తిరిగి రావడంతో ఆమె ఆచూకీ కోసం దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటీషన్‌ను కోర్టు కొట్టివేసింది. అయితే విచారణ సమయంలో వాది నెం.1 తన భర్తకు విడాకులు ఇచ్చిందని, మళ్ళీ పెళ్లి చేసుకున్నట్లు ఆరోపిస్తూ కోర్టులో పోలీసులు ప్రకటనలు చేశారు. ఈ ప్రకటనలపై పోలీసుల నుండి వివరణ కోరుతూ వాది నెం.1 హైకోర్టులో ఒక దరఖాస్తును దాఖలు చేశారు. హైకోర్టు మొదట అభ్యర్థనను అనుమతించింది. అయితే తీర్పు ఇవ్వడానికి ఏమీ లేకపోవడంతో పిటీషన్‌ను కొట్టివేసింది. పిటీషనర్ సమీక్ష, వివరణ కోసం అనేక దరఖాస్తులను దాఖలు చేశారు. వాటన్నిటినీ హైకోర్టు కొట్టివేసింది. పోలీసుల ప్రకటనల కారణంగా ఓపన్ కోర్టులో తనకు అవమానం జరిగిందని, తద్వారా తన పరువు తీశారని వాది నెం.1 సుప్రీం కోర్టుకు వెళ్ళారు. సర్వోన్నత న్యాయస్థానం పిటీషన్‌లో ఏలాంటి బలం లేదని పరువు నష్టం, అవమానానికి సంబంధించిన పిటీషనర్ పిర్యాదు పూర్తిగా తప్పు అని పేర్కొంటూ కోర్టు విచారణలు తరచుగా అసహ్యకరమైన ప్రకటనలు సత్యాన్వేషణలో భాగంగా ప్రశ్నలను కలిగి ఉంటాయని, వీటిని అవమానకరమైనవిగా భావించలేమని, నిజాన్ని రాబట్టాలనే సదుద్దేశ్యంతో ఉంటాయని కోర్టు నొక్కి చెప్పి పిటీషన్‌ను కొట్టివేసింది. (శ్రీమతి ధనలక్ష్మీ, ఎ.సునీత మధురియా అండ్ ఎన్ఆర్ ఎదిరి రాజస్థాన్ స్టేట్ అండ్ అదర్స్).

## జాతీయస్థాయి టెక్ ఫెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ


జాతీయ స్థాయి టెక్ పెస్ట్‌లో ప్రతిభ చూపిన అనమాచార్య విద్యార్థులు

**(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)**
తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఇటీవల నిర్వహించబడిన జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్ట్‌లో అన్నమాచార్య యూనివర్శిటీ విద్యార్థులు తమ సాంకేతిక ప్రతిభతో అనేక బహుమతులు గెలుచుకొని విశిష్టంగా నిలిచారు. ఈ టెక్ ఫెస్ట్‌లో స్లైడ్ డెక్" ఈవెంట్‌లో ఎం. భార్గవి, విజయ్ కుమారి, ఎం. విజయకుమారి, పీ. శివాని బహుమతి అందుకున్నారు. పోస్టర్ ప్రెజెంటేషన్" ఈవెంట్‌లో ఎం. వైష్ణవి విశేష ప్రతిభను ప్రదర్శించి బహుమతి సాధించింది. అలాగే టెక్నికల్ క్విజ్" విభాగంలో వి. ప్రవీణ్, కె. హిందుజా, ఎన్. వేణుమాధవ్‌లు విజేతలుగా నిలిచారు. ఈ విజయాలను సాధించిన విద్యార్థులంతా సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందినవారు కావడం విశేషం. విద్యార్థుల విజయాలను గర్వంగా ప్రకటించిన అనమాచార్య యూనివర్శిటీ ఉపకులపతి డా. ఈ. సాయిబాబారెడ్డి, రిజిస్ట్రార్ డా. ఎన్.మల్లికార్జునరావు, ప్రిన్సిపాల్ డా. ఎస్. ఎం.వి. నారాయణ విద్యార్థులను అభినందిస్తూ, ఈ విజయాలు విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలను, కళాత్మకతను ప్రతిబింబిస్తాయన్నారు. వారిని మరింత ప్రోత్సహించి అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే ప్రయత్నాలు జరుగుతాయని పేర్కొన్నారు. విద్యార్థులకు మార్గదర్శకత్వం అందించిన అధ్యాపకుల కృషిని వారు ప్రత్యేకంగా ప్రశంసించారు.

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

- 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే ఆడపిల్లలకు వివాహం చేయాలి

- లక్కిరెడ్డిపల్లి ఐసిడిఎస్ సిడిపిఓ పద్మావతి

**గాలివీడు, మార్చి 26(ప్రభాతవార్త):**
బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని కావున 18 సంవత్సరాలు వయస్సు నిండిన తరువాత మాత్రమే ఆడపిల్లలకు వివాహం చేయాలని లక్కిరెడ్డిపల్లి ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని నూలివీడు పంచాయతీ కేంద్రంలోని సచివాలయంలో అంగన్వాడీ టీచర్లతో కిషోరి వికాసం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలపై ప్రభుత్వం కఠినంగా ఉన్నదని అందుకు పాల్పడిన అందరిపైన కేసులు నమోదు చేయడం జరుగుతున్నదని తెలిపారు. బాల్యవివాహాల వల్ల అనర్థాలతో పాటు రక్తహీనత, శిశు మరణాలు, మాతృ మరణాలు సంభవిస్తాయని పేర్కొన్నారు. ప్రస్తుత సమాజంలో ఆడ, మగ అనే తారతమ్యం లేకుండా అందరినీ సమానంగా చూడాలని తెలిపారు. ప్రస్తుతం ఆడపిల్లలు చదువుతో పాటు అన్ని రంగాలలో రాణిస్తున్నారని వారిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపైన ఉన్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్ వైజర్లు సుజాతరెడ్డి, అరుణకుమారి, టీచర్లు, వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

